# ముద్ర

సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 09.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 109
పేజీలు: 12 వెల: రూ. 5


## సండే ధమాకా



- అఫ్ఘన్ ఎత్తులు పారనివ్వని న్యూజిలాండ్
- టఫ్ మ్యాచులో కివీస్ ఘనవిజయం
- ఇక ఇంగ్లండ్ ను దాదాపు ఓడించినంత పనిచేసిన నేపాల్
- జోరుగా సాగిన శ్రీలంక-ఐర్లాండ్
- ఆదివారం రసవత్తరంగా మ్యాచులు

వరల్డ్‌కప్ ఆరంభంలోనే
### న్యూజిలాండ్ గెలుపు
అఫ్గాన్‌పై 5 వికెట్ల విజయం

11

### ఇంగ్లండ్‌కు చెమటలు పట్టించిన నేపాల్
చివరి బంతికి గట్టెక్కిన ఇంగ్లాండ్

# పాక్ రిపేర్లు

## ఆపరేషన్ సింధూర్ దెబ్బకు అతలాకుతమైన పాకిస్తాన్

ఆపరేషన్ సిందూర్‌లో భారత్ దాడులతో పాక్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందన్న వాస్తవం ఇప్పుడు ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టమవుతోంది. 'ఏమీ కాలేదు' అంటూ పాక్ చేస్తున్న వాదనలకు భిన్నంగా, భొలారి వాయుసేన స్థావరంలో ధ్వంసమైన హ్యాంగర్‌కు మరమ్మతులు జరుగుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. మే 10న భారత వాయుసేన దాడి ప్రభావమే ఈ రిపేర్లకు కారణమని రక్షణ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

09




- భొలారి ఎయిర్‌బేస్‌లో హ్యాంగర్ మరమ్మతులు
- ఉపగ్రహ చిత్రాల్లో బయటపడ్డ పాక్ నష్టం
- మే 10న భారత వాయుసేన దాడి ప్రభావం
- ధ్వంసమైన సాబ్-2000పై భారత్ అంచనా

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు
# రెఫరెండం
## గుదిబండ గా మున్సిపల్ ఎన్నికలు

- అధిక స్థానాలు గెలవాలని అధిష్టానం నుంచి స్ట్రాంగ్ వార్నింగ్
- ఇప్పటికే అభ్యర్థుల గెలుపునకు ఎదురీదుతున్న ఎమ్మెల్యేలు
- ఒక్క అభివృద్ధి పని చేయలేదని ఎమ్మెల్యేల తీరును ఎండగడుతున్న బీజేపీ, బీఆర్ఎస్
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ధీటుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు
- నియోజకవర్గంలోనే తిష్ట వేసిన మూడు పార్టీల నేతలు
- కాంగ్రెస్ అభ్యర్థుల తరపున పాలమూరులో ఇప్పటికే ప్రచారం చేసిన మంత్రి దామోదర
- బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఏకంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ ప్రచారం
- బీఆర్ఎస్ అభ్యర్థులను పట్టించుకోని రాష్ట్ర నాయకత్వం

10




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అగ్నిపరీక్షగా మారాయి. అధిక స్థానాలు గెలవాలని అధిష్టానం నుంచి వచ్చిన స్ట్రాంగ్ వార్నింగ్‌తో అధికార పార్టీ ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటనలు చేస్తుండగా, బీజేపీ–బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గట్టిగా ఎదురుదాడి చేస్తూ ఈ ఎన్నికలను కాంగ్రెస్ పాలనపై రెఫరండంగా మార్చేశారు.

## ఎవిడెన్స్ భద్రం
### ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్ కేసుల ఆధారాలు సేఫ్



- ఆ రికార్డులు అక్కడ లేవు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏడు ఫైల్స్ కాలిపోయాయి
- మిగిలినవన్నీ సేఫ్ గా ఉన్నాయి
- ఆ కేసుల మెటీరియల్ ఇక్కడ లేదు
- ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖాగోయల్

03

## భారత్ - మలేషియా నవశకం
### కీలక రంగాలపై ఇరు ప్రధానుల ఒప్పందాలు



- ఉగ్రవాదంపై మలేషియాతో కలిసి పోరాడతాం: ప్రధాని మోదీ
- సెమీకండక్టర్ల నుంచి డిజిటల్ టెక్నాలజీ వరకు బంధం
- ప్రధానులు మోదీ-ఇబ్రహీం భేటీలో కీలక విషయాలు

09

## ఒక్కో వృద్ధుడికి కాంగ్రెస్ రూ.52వేలు బాకీ



- ఓట్ల కోసం వచ్చే ఆ పార్టీ లీడర్లను నిలదీయండి
- మేం అన్నం పెడితే.. కాంగ్రెస్ మీకు సున్నం రాస్తుంది
- సదాశివపేటలో అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

03

## మెగా సిటీ
# కారిడార్
### ఐదు నగరాలను కలిపే ప్లాన్
### రేవంత్ సర్కార్ 'పెంటాసిటీ' మాస్టర్ ప్లాన్

- ఉత్తర తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే సీఎం బృహత్తర ప్రణాళిక
- వరంగల్-కరీంనగర్ మధ్య 'పంచనగరి'గా కొత్త అర్బన్ బెల్ట్
- ఐదు నగరాల అనుసంధానంతో హైదరాబాద్‌కు సమాంతరంగా మరో గ్రోత్ హబ్
- రింగ్ రోడ్లు, ఐటీ హబ్‌లు, వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్లే లక్ష్యం
- మెగా సిటీ కారిడార్‌తో వికేంద్రీకృత ఉపాధికి బాటలు
- మామునూరు ఎయిర్‌పోర్ట్, స్కిల్ సెంటర్లతో అభివృద్ధికి ఊతం
- కోర్-ప్యూర్-రేర్ మోడల్‌తో తెలంగాణ ఎకానమీకి కొత్త రూపం
- టైర్-2 నగరాల బలోపేతమే ప్రభుత్వ అభివృద్ధి వ్యూహం
- వరంగల్ విద్యా శక్తి, కరీంనగర్ పారిశ్రామిక బలం కలయిక
- రియల్ ఎస్టేట్, వ్యాపార రంగాలకు కొత్త ఊపిరి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** వరంగల్, హనుమకొండ, కాజీపేట, హుజురాబాద్, కరీంనగర్ నగరాలను కలిపి 'పంచనగరి'గా తీర్చిదిద్దే వినూత్న ప్రణాళికను సీఎం రేవంత్ రెడ్డి తెరపైకి తీకొచ్చారు. ఈ ఐదు సిటీలను ఒక అర్బన్ బెల్ట్‌గా నిర్మించటాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రింగ్ రోడ్ల విస్తరణ, ఐటీ హబ్‌ల ఏర్పాటు, వేస్ట్–టు–ఎనర్జీ ప్లాంట్ల ద్వారా ఈ ప్రాంతాన్ని హైదరాబాద్‌కు సమాంతరంగా ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. తెలంగాణలో అభివృద్ధి అంతా హైదరాబాద్ చుట్టూనే కేంద్రీకృతమై ఉంది. ఇది కాదనలేని సత్యం. తెలంగాణ వ్యాప్తంగా డెవలప్‌మెంట్ జరగాలంటే నగరాలను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరాలుగా వరంగల్, కరీంనగర్ పట్టణాలు నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సరికొత్త, వినూత్నమైన విజన్‌ను ఆవిష్కరించారు. ఇప్పటికే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో హైదరాబాద్ రూపురేఖలను మారుస్తున్న ప్రభుత్వం.. తాజాగా వరంగల్ ట్రై సిటీలు – హుజూరాబాద్, కరీంనగర్ నగరాలను కలిపి

మిగతా 02లో

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
### నాంపల్లి ఘటనపై కేటీఆర్ డిమాండ్

- అగ్నిప్రమాదం వెనుక పెద్ద కుట్ర ఉంది
- ఓటుకు నోటు కేసు నుంచి తప్పించుకునేందుకే ఆధారాల ధ్వంసం
- సీఎం ఆదేశాలతోనే ల్యాబ్‌కు నిప్పంటించారు!
- మున్సిపల్ ఎన్నికల హడావుడిలో ప్లాన్ చేసి ఆధారాలు మాయం
- ఫోరెన్సిక్ డైరెక్టర్ తూతూమంత్ర వివరణపై కేటీఆర్ అసంతృప్తి

02



## భూపాలపల్లి జిల్లా
# ఎక్కడికీ పోదు
### రాష్ట్రంలో ఏ జిల్లానూ రద్దు చేయం

- కొత్త జిల్లాల ఆలోచనే లేదు
- జిల్లాల పునర్విభజనపై విష ప్రచారాలు నమ్మొద్దు
- ఒకవేళ చేయాల్సి వస్తే ప్రజామోదం, ప్రతిపక్షాల సలహాలు తీసుకుంటాం
- సింగరేణి మెడికల్ బోర్డు ఆలోచన లేదు
- ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ ను కిషన్ రెడ్డి కాపాడుతున్నడు
- బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలకు దెబ్బకు దెబ్బ కొడతాం

02



## నా జీవితం గుణపాఠం
### ప్రేమ పెళ్లి చేసుకుని తప్పుచేశా

ఇద్దరు పిల్లలకు ఉరేసి తల్లి సూసైడ్!
సూసైడ్‌కు ముందు తల్లిదండ్రులకు లేఖ

09



## బీజేపీని ఓడించేందుకు ఎంఐఎంతో
# రూ. 100 కోట్ల డీల్



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

- నిన్న కాంగ్రెస్, ఎంఐఎం రహస్య సమావేశం పెట్టుకుంది
- బీజేపీ 50సీట్లలో గెలవబోతోందని తెలిసి రూ.100 కోట్లతో ఓట్లను కొనేందుకు సిద్ధమయ్యారు
- పెద్ద ఎత్తున ఓట్లను కొని గెలవాలని కుట్ర చేస్తున్నయ్
- కాంగ్రెస్, ఎంఐఎం వర్సెస్ బీజేపీ మధ్య ఆట స్టార్ట్ అయ్యింది
- కరీంనగర్ లో 'విజయ సంకల్ప ర్యాలీ'
- 50 వేల మందితో కాషాయ కార్యకర్తలతో కదం
- జన సంద్రమైన కరీంనగర్

09

## బైకులు, కార్లు చీప్
### భారత్-అమెరికా ట్రేడ్ డీల్ ఎఫెక్ట్..

10

తగ్గనున్న హార్లే డేవిడ్సన్ బైకుల ధరలు!

అమెరికా నుంచి దిగుమతయ్యే మోటారు సైకిళ్లపై సుంకం తగ్గించినట్లు ప్రకటించిన భారత ప్రభుత్వం



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లకు నిలబడ్డ అభ్యర్థులు మందు, విందులతో హోరెత్తిస్తున్నారు. కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఓటర్లు ఎంజాయ్ చేస్తున్నారు.



## తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు




దిశ ఉదంతం (హైదరాబాద్): 2019లో షంషాబాద్ దగ్గర వెటర్నరీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా ఆగ్రహం కలిగించింది. ఈ కేసులోని నిందితులు ఆ తర్వాత పోలీసు ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

# భూపాలపల్లి జిల్లా ఎక్కడికి పోదు

### బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర, జయశంకర్ భూపాలపల్లి:** ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న జిల్లాల్లో ఏ ఒక్క జిల్లాను తొలగించడం కానీ కొత్త జిల్లా ఏర్పాటు చేసే ఆలోచన తమ ప్రభుత్వ పరిశీలనలో లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎప్పుడైనా జిల్లాల పునర్విభజనపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకుంటే బహిరంగంగా ప్రజలకు చెప్పి, శాసనసభలో చర్చించి ప్రతిపక్షాల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ఆ తర్వాతే జిల్లాలపై ఆలోచన చేస్తామన్నారు. భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ పార్టీ రద్దు చేయబోతోందని ఇటీవల కొంత మంది విషపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొందరు చిల్లర మల్లర ప్రయత్నాలు, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని అపోహలు సృష్టించాలని ప్రయత్నాలు చేసినా భూపలపల్లి జిల్లా ఎక్కడికి పోదని స్పష్టం చేశారు. ఈ వేదిక నుంచి అపోహలపైరాష్ట్రంలోని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు వివరణ ఇస్తున్నానని సీఎం తెలిపారు. కుట్రలు, కుతంత్రాలతో విష ప్రచారాలు చేస్తున్న పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లో సీఎం పర్యటించారు. అక్కడ ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం 'ప్రజాపాలన–ప్రగతి బాట' సభలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీ లు వేరు వేరు కాదన్న సీఎం.. ఆయా పార్టీలు బొమ్మ, బొరుసులా.. బిల్లా రంగ లా.. కాంగ్రెస్ ను ఓడించాలని ప్రయత్నం చేస్తున్నాయని సీఎం ఆరోపించారు. ఆయా పార్టీల కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల కుట్రలకు దెబ్బకు దెబ్బ కొడతామన్న సీఎం... మీ తాతలు, ముత్తాతలను తీసుకువచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు మీసంగతి చూస్తారని హెచ్చరించారు. ఆడబిడ్డల ఆశీర్వాధం ఉంటే మోదీ, కేసీఆర్ తాత వచ్చినా ఓడిస్తామన్నారు. ఎవరికి వారు తనను వాళ్ల తమ సామాజిక వర్గం పేరుతో పిల్చుకుంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఎవరు ఎలాంటి పేరుతో పిలిచినా సంతోషిస్తానని చెప్పారు.

తెలంగాణ లో మున్సిపాలిటీలు, కార్పోరేషన్లకు 17,442 కోట్లు మంజూరు చేశామన్న సీఎం.. వీటిలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీ లకు రూ. 6116 కోట్లు ఇచ్చామన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీకి రూ. 92 కోట్ల నిధులు మంజూరు చేశామని వివరించారు. సరస్వతి పుష్కరాలు అద్భుతంగా నిర్వహించుకున్నామన్నసీఎం... వచ్చే ఏడాది జరగనున్నగోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు రూ. 4వేల కోట్లు ఖర్చు పెట్టి గోదావరి పరిహాకప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. రూ. 22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పన 4.5 లక్షల ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని సీఎం వివరించారు. వచ్చే బడ్జెట్ లో పేదల ఆత్మగౌరవం పెరిగేలా, ఆడబిడ్డలు ఆశీర్వదించేలా రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ సాధణలో తొలి, మలిదశ ఉద్యమాల్లో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల పాత్ర కీలకం అని సీఎం అన్నారు. నల్ల బంగారాన్ని వెలికి తీస్తున్న సింగరేణి కార్మికులు దేశానికి ఆదర్శం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. భూపాలపల్లి కుగ్రామంగా ఉన్న సమయంలో అన్న నందమూరి తారకరామరావు మొట్టమొదట దీన్ని మండల కేంద్రంగా మార్చి సింగరేణి బొగ్గు ఉత్పత్తికి మొట్టమొదటి పునాది రాయి వేశారనీ దాంతో ఆ తర్వాత భూపాలపల్లి వెనక్కి తిరిగి చూడలేదన్నారు. ఇప్పుడు భూపాలపల్లి జిల్లా కేంద్రంగా, మున్సిపాలిటీగా అభివృద్ధి చెందిందన్నారు.

**మెడికల్ బోర్డు ఆలోచన లేదు:**
సింగరేణి కార్మికుల మెడికల్ బోర్డు విషయంలో విపక్ష పార్టీ నేతలు విషం చిమ్ముతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇలాంటి వారిని మోకాళ్లపై కూర్చొబెడుతామని స్పష్టం చేశారు.ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మెడికల్ బోర్డు ఆలోచన ప్రభుత్వ ఆలోచనలో లేదన్నారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. అలాంటి సింగరేణి కార్మికులకు నష్టం చేసే ఏ పనిని ఈ ప్రభుత్వం చేయదన్నారు. డిస్మిస్ కార్మికులు 217 మంది ఉన్నారని నా దృష్టికి వచ్చింది. ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు.

**ఆ ముగ్గురిని అరెస్ట్ చేసేంత వరకు నువ్వు కిషన్ రావే..**
కిషన్ రెడ్డి.. ముమ్మాటికీ కేసీఆర్ కు దత్తపుత్రుడేనని సీఎం పునరుద్ఘాటించారు. కల్వకుంట్ల కిషన్ రావు గా మారిన కిషన్ రెడ్డి.. కాళేశ్వరం అవినీతి కేసులో కేసీఆర్ ను అరెస్టు చేయకుండా అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. దీనిపై తాను నిలదీస్తే... కేసీఆర్ ను అరెస్ట్ చేయడానికి నేను ఏమైనా సీఎం నా అని కిషన్ రెడ్డి అంటున్నారని చెప్పారు. నల్లి కుంట్ల మాటలు మాట్లాడుతున్న కిషన్ రెడ్డి... తన ఫెవికాల్ బంధంతో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను కంచె వేసి కాపాడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీస్ రావును అరెస్టు చేసే వరకు కిషన్ రెడ్డిని కల్వకుంట్ల కిషన్ రావు అనే పిలుస్తానన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ ను కాపాడుతుంది మీరు కాదా అని రేవంత్ రెడ్డి నిలదీశారు. రూ.వేలకోట్ల ఆస్తులను పేదల కోసం దానం చేసిన సోనియా, రాహుల్ గాంధీ ని కేసుల పేరుతో సీబీఐ, ఈడీ పేరుతో తిప్పించి అమానించలేదా..? అని కిషన్ రెడ్డిని ప్రశ్నించారు. గాంధీ కుటుంబాన్ని మానసిక క్షోభ కల్గించిన మీకు ఉసురు తగులుతుందన్నారు. ఇప్పటికీ రాహుల్ గాంధీని ఈడీ, సీబీఐ కేసులతో వేధిస్తున్నారని సీఎం మండిపడ్డారు. గాందీ కుటుంబంపై ఈడీ , సీబీఐ ని ఉపయోగిస్తున్నప్పుడు కాళేశ్వరం పైన సీబీఐ విచారణకు పంపిస్తే ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. 10 ఏళ్లు కేసీఆర్ సీఎం గా, మూడు సార్లు మోదీ ప్రధానిగా ఉన్నారన్న ఆయన రాష్ట్రానికి ఎలాంటి మేలు చేకూర్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లు సీఎంగా ఉండి భూపాలపల్లి కి బై పాస్ రోడ్డు తీసుకురాలేదని మండిపడ్డారు. ఎర్రవెల్లి పామ్ హౌస్ లో బోర్లా బొక్కలా పడుకున్న కేసీఆర్ మీకు నిధులు ఇవ్వరని ప్రజలకు చెప్పారు. కేసీఆర్ ఇంటిల్లిపాలికి పదవులు ఇచ్చుకున్నడు..కాని పేదలకు ఏమీ చేయలేదని మండిపడ్డారు. ప్రధాని మోడి కూడా.. ఏనాడు భూపాలపల్లికి రాలేదన్నారు. కేసీఆర్, మోదీని చూసి ఓటు వేస్తే మోసపోతారు జాగ్రత్త అని ఓటర్లను అప్రమత్తం చేశారు. పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే సంసారం ఆగం అవుతుందన్న సీఎం.. కాంగ్రెస్ కు ఓటేస్తే మీ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ తీరు తిక్కలోడు తిరునాళ్లకు పోయినట్లుందని సీఎం ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు గెలిపిస్తే గండ్ర వెంకటరమణారెడ్డి కేసీఆర్ సంకన చేరారని విమర్శించారు.

**బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి**
బీఆర్ఎస్ పార్టీ ఇక నుంచి బ్లాక్ మెయిల్ రాజకీయ సమితి.అని రేవంత్ రెడ్డి అన్నారు. గత పాలకులు ఫోన్ ట్యాపింగ్ తో ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, జడ్జిలు, సినీతారలను వదలలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భార్యభర్తలు ఫోన్లలో మాట్లాడుకున్న విషయాలు వినే పాపాత్ములు ఎవరైనా ఉంటారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ చేసి వ్యాపారులను బ్లాక్ మెయిల్ చేసిన గత పాలకులు వారి ఆస్తులు రాయించుకున్నారని చెప్పారు. ఈ విషయాన్ని బీజేపీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. టెలిఫోన్ ట్యాపింగ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి రూ.వందల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో రూ. 1500 కోట్లు ఎవడబ్బ సొమ్ము అని సీఎం ప్రశ్నించారు. చేసిన పాపాలు ఊర్కే పోవన్న సీఎం... .చేసిన పాపాల ఊబిలో బీఆర్ఎస్ పార్టీ కూరుకుపోతుందని చురకలంటించారు.

## ముఖ్యమంత్రి భూపాలపల్లి బహిరంగ సభ చిత్రాలు










**ముద్ర న్యూస్ బ్యూరో, చెన్నై ఫిబ్రవరి 8:** అపోలో ఆసుపత్రుల రీజినల్ సీఈవో ( తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ) తేజస్వి రావుకు ఈ ఏడాది 'బెస్ట్ లీడర్' అవార్డు లభించింది. ఆదివారం నాడు చెన్నెలో కన్నుల పండువగా జరిగిన అపోలో లీడర్ షిప్ అవార్డ్స్ 2026 ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అపోలో చైర్మన్ ప్రతాప్ రెడ్డి కూతుళ్లు.. అపోలో ఆసుపత్రుల డైరెక్టర్లు సి.సునీత రెడ్డి, సి. ప్రీతా రెడ్డిల చేతుల మీదుగా తేజస్వీ రావు ఈ అవార్డును స్వీకరించారు.



# రాత్రికి రాత్రే కోటీశ్వరులయ్యారు.. దివాళా

నడమంత్రాన సిరి.. నరం మీద పుండు మనిషిని నిలవనీయకుండా చేస్తాయని అంటారు. ఆ సామెతకు అర్థం ఏమిటో ఈ రైతులను చూస్తే తెలిసింది. వాస్తవానికి వారంతా కొన్ని సంవత్సరాల క్రితం రైతులు. తమ భూముల్లో పంటలు పండించే వారు. పంట ఉత్పత్తులను విక్రయించగా వచ్చిన డబ్బుతో జీవనం కొనసాగించేవారు. వ్యవసాయం చేస్తున్నప్పటికీ వారేమీ గొప్ప శ్రీమంతులు కాదు. అలాగని బికారీలు కూడా కాదు.

వారు ఊహించని విధంగా రాత్రికి రాత్రే కోటీశ్వరులయ్యారు. వారికి ఏ దో జాక్పాట్ లభించలేదు. లాటరీ కూడా తగలలేదు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం జెవార్ విమానాశ్రయాన్ని నిర్మిస్తోంది. దీనికోసం అక్కడి రైతుల భూములను సేకరించింది. పరిహారంలో భాగంగా ఒక్కో ఎకరానికి 20 లక్షలు చెల్లించింది. విమానాశ్రయ నిర్మాణానికి దాదాపు 12 ఎకరాలు ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వం భారీగా డబ్బులు చెల్లించిన నేపథ్యంలో రైతులకు ఏం చేయాలో తెలియలేదు. ఎక్కడ ఇన్వెస్ట్మెంట్ చేయాలో అర్థం కాలేదు. దీంతో వారంతా విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారు. ఖరీదైన కార్లు కొనుగోలు చేశారు. సర్జరీ జీవితాన్ని అనుభవించడం మొదలుపెట్టారు. కొంత కాలానికి చేతిలో ఉన్న డబ్బు మొత్తం ఖర్చయిపోయింది. ఇప్పుడు కనీసం ఫోన్ కూడా రిపేర్ చేయించుకోవడానికి వారి దగ్గర డబ్బులు లేవు.

అందరి వద్ద కూడా విలాసవంతమైన భవనాలు.. వాహనాలు ఉండడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. దీంతో అక్కడి రైతులు తమ బాధను చెప్పుకుంటున్నారు . ఇక్కడ రైతుల పరిస్థితి గురించి తెలిసిన జాతీయ మీడియా కథనాలను ప్రసారం చేసింది . "రైతులకు భారీగా డబ్బు వచ్చింది. వారంతా కూడా విలాసవంతమైన జీవితాన్ని అనుభవించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత లగ్జరీ లైఫ్ లో భాగంగా ఖర్చు పెరిగిపోవడంతో డబ్బులు పూర్తిగా అయిపోయాయి. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం ఖర్చు కావడంతో ఏం చేయాలో వారికి తెలియడం లేదు. అందువల్లే కనీసం ఫోన్లు కూడా రిపేరు చేయించుకోలేని స్థితిలో వారు కూరుకుపోయారని" జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మరోవైపు గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలవరం నిర్మాణ సమయంలో నిర్వాసిత రైతులకు కూడా ఇదేవిధంగా ప్రభుత్వం పరిహారం అందించింది. కానీ ఆ పరిహారంతో చాలామంది వాహనాలు కొనుగోలు చేశారు. ఖరీదైన భవనాలు నిర్మించారు. చివరికి చేతిలో చిల్లిగవ్వలేక ఇప్పుడు వేరే వేరే పనులు చేసుకుంటున్నారు. ఖరీదైన వాహనాలను నిర్వహించే సామర్థ్యం లేక వాటిని అమ్మేశారు. నివాసాలు కూడా అమ్మాలని అనుకున్నప్పటికీ.. వాటిని కొనేవారు లేకపోవడంతో మిన్నకుంటున్నారు. ఇప్పుడు ఉత్తర ప్రదేశ్ రైతుల పరిస్థితి కూడా పోలవరం నిర్వాసితుల మాదిరిగానే మారిపోయిందని నెట్టింట చర్చ నడుస్తోంది.

# మెగా సిటీ కారిడార్

(మొదటి పేజీ తరువాయి)
'పంచనగరి'గా తీర్చిదిద్దే బృహత్తర సంకల్పం తీసుకుంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. కరీంనగర్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ చేసిన ప్రకటన ఉత్తర తెలంగాణ భవిష్యత్తును మార్చే ఒక మాస్టర్ ప్లాన్‌లా కనిపిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలుగా ఉండగా.. సైబరాబాద్‌తో కలిపి అది ట్రై సిటీగా మారింది. ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ పూర్తయితే అది క్వాడ్ సిటీ అవుతుంది. అయితే, ఉత్తర తెలంగాణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వరంగల్, హన్మకొండ, కాజీపేట (త్రినగరి) ప్రాంతాలను కరీంనగర్, హుజూరాబాద్‌లతో అనుసంధానిస్తూ ఒకే 'సిటీ బెల్ట్'గా మార్చాలని రేవంత్ ప్లాన్ చేస్తున్నారు.

**ఇదే రేవంత్ రెడ్డి కలలుగంటున్న 'పంచనగరి'.**

హైదరాబాద్ నగరంపై విపరీతమైన ఒత్తిడిని తగ్గించి, ఉపాధిని వికేంద్రీకరించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ కారిడార్‌లో వరంగల్, కరీంనగర్ నగరాల వెలుపల రింగ్ రోడ్లను (ORR) నిర్మించి, వాటిని అనుసంధానించడం ద్వారా రవాణా వేగవంతం చేయటం లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు నగరాల మధ్య భారీ ఇంటిగ్రేటెడ్ డంప్ యార్డ్‌ను ఏర్పాటు చేసి, బయో వేస్ట్ పవర్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం, ఐటీ సెక్టార్ హబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, ఇతర ఉపాధి మార్గాలకు ఈ ప్రాంతాన్ని కేంద్రంగా మార్చటం లక్ష్యంగా పెట్టుకున్నారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయం పూర్తి చేయడం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు ఈ ప్రాజెక్టులో కీలకంగా మారనున్నాయి.

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రేవంత్ రెడ్డి మూడు మండలాలుగా విభజించారు.**
క్యూర్: హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల ఉండే కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, ప్యూర్: ఓఆర్ఆర్, ప్రతిపాదిత ప్రాంతీయ రింగ్ రోడ్ మధ్య ఉన్న తయారీ రంగం. రేర్: రీజినల్ రింగు రోడ్డుకు ఆవల ఉండే వ్యవసాయ అనుబంధ రంగాల ప్రాంతం. ఈ విభజనలో వరంగల్–కరీంనగర్ కారిడార్ తెలంగాణకు మరో హైదరాబాద్‌లా నిలవనుంది. తెలంగాణ అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా.. టైర్–2 నగరాలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వా రా సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వరంగల్ ఇప్పటికే విద్యా కేంద్రంగా ఉంది. దానికి కరీంనగర్ పారిశ్రామిక శక్తి తోడైతే ఉత్తర తెలంగాణ ఒక శక్తివంతమైన గ్రోత్ ఇంజిన్‌గా మారునుంది. స్థానిక యువతకు ఉపాధి లభించడమే కాకుండా, రియల్ ఎస్టేట్, వ్యాపార రంగాలు కొత్త పుంతలు తొక్కే ఛాన్స్ ఉంది.

### నాంపల్లి ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో

# విచారణ జరపాలి

**ముద్ర, హన్మకొండ :** నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ అగ్నిప్రమాదం వెనుక కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డినే ఆ ల్యాబ్‌ను తగులబెట్టించాడని ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు. ఓటుకు నోటు కేసు నుంచి తప్పించుకోవడానికే ఆయన ఈ ప్రమాదం చేయించారని అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం హనుమకొండ జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో అందరూ బిజీగా ఉండడంతో ఇదే అదునుగా భావించిన సీఎం.. ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. పక్కా ప్లాన్‌తో ఆధారాలు మాయం చేశారని విమర్శించారు. తాను తప్పించుకోవడానికి మిగతా కేసులకు సంబంధించిన ఆధారాలు కూడా దెబ్బతినేలా ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్నిప్రమాద ఘటనపై ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ డైరెక్టర్ తూతూమంత్రంగా వివరణ ఇచ్చారని విమర్శించారు. నేరాల విచారణలో ఫోరెన్సిక్ కీలక విభాగమన్న కేటీఆర్.. వేలాది కేసుల వివరాలు అగ్గికి బుగ్గి అయ్యాయని పేర్కొన్నారు. ఈ ప్రమాదం తర్వాత ఎంతోమంది క్రిమినల్స్ తప్పించుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అగ్ని ప్రమాద ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మూడు అంతస్థుల భవనంలో మంటలను ఆర్పేందుకు మూడు గంటల సమయం పడుతుందా? అని ప్రశ్నించారు. దాంతో పాటు ప్రమాద సమయంలో డ్యూటీలో కూడా ఎవరూ లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. స్వయంగా సీఎం చేతిలో ఉన్న శాఖలో ఇలా జరగడం చరిత్రలో తొలిసారి అన్నారు. విచారణ చివరి దశకు చేరుకోవడంతో సాక్ష్యాలు మాయం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డితో బీజేపీకి లాలాచీ లేకపోతే దీనిపై విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



### ఉత్తర ప్రదేశ్‌లో లవ్ జిహాద్ గుట్టు రట్టు

# 300లకుపైగా బాధితులు

ఉత్తరప్రదేశ్.. మోదీ తర్వాత బలమైన వ్యక్తిగా గుర్తింపు ఉన్న వ్యక్తి యోగి ఆదిత్య నాథ్ సీఎంగా ఉన్నారు. 8 ఏళ్లుగా రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నారు. అయినా ఇంకా అక్కడక్కడ అసాంఘిక శక్తులు ఉన్నాయి. వాటి తోకలను కూడా కత్తిరిస్తున్నారు. ఈ క్రమంలో లవ్ జిహాద్ బయటపడింది.

**హిందువుగా చెలామణి అవుతూ..**
ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాలో ఎంఐఎం కార్యకర్త అజ్వర్ ఉల్ హక్ 'ప్రిన్స్' పేరుతో హిందువుగా ప్రచారం చేసుకుంటున్నాడు. చేతులకు కంకనాలు, మెడలో ఎరుపురంగు మాలతో తిరుగుతూ హిందువుగా చెప్పుకుంటూ యువతులను మోసం చేశాడు. చాలామంది అమ్మాయిలను ఆకర్షించాడు. దాదాపు అతని బాధితులు వందల సంఖ్యలో ఉంటారని తెలుస్తోంది.

**ఫిర్యాదుతో విచారణ..**
ఇటీవల ప్రిన్స్ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిని అరెస్టు చేశారు. తర్వాత బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. దీంతో పోలీసులు లోతుగా విచారణ చేయగా, అతను ఎంఐఎం నాయకుడు అని తేలింది. యువతులను మోసం చేయడం పథకంలో భాగమని అనుమానిస్తున్నారు. బస్తీలో 300 మంది హిందూ యువతులు ఈ లవ్ జిహాద్‌కు బలైనట్లు సమాచారం. ఇది సంఘటిత రంగుల మార్పిడి ఉద్దేశ్యాన్ని సూచిస్తోంది.

**పోలీసు చర్యలు..**
విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో పోలీసులే షాక్ అవుతున్నారు. ఈ ఘటన స్థానిక సమాజంలో భయాందోళన రేపింది. పోలీసులు మరిన్ని బాధితులను గుర్తించి, సంఘటిత కుట్ర ఆచరణలో ఇతరులు ఉన్నారా అని దర్యాప్తు చేస్తున్నారు.



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు**

అయేషా మీరా హత్య (విజయవాడ): 2007లో విజయవాడ హాస్టల్‌లో ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా అత్యంత దారుణంగా హత్యకు గురైంది. దశాబ్దాలు గడిచినా అసలైన నిందితులు ఎవరనేది ఇప్పటికీ పెద్ద మిస్టరీగా మిగిలిపోయింది.



# పోలీసు వృత్తి సామాజిక బాధ్యత

- సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలి
- బాధితులకు భరోసా అసలైన విజయం
- నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

**ముద్ర, హైదరాబాద్ :**



పోలీసు వృత్తి కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యత అని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ వెల్లడించారు. విధులకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. ప్రతి పనిలోనూ సృజనాత్మకత, మానవీయత ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన 1,446 మంది పోలీసు సిబ్బందికి ఆదివారం రివార్డులు అందజేశారు. నగర పోలీసు చరిత్రలో తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలతో పాటు 'గుడ్ వర్క్ డన్' రివార్డులను పోలీస్ సిబ్బందికి ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రదానం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను సజ్జనార్ అభినందించి.. వారికి దిశానిర్దేశం చేశారు. సిబ్బందిలో ఉన్న అసాధారణ ప్రతిభను, వినూత్న ఆలోచనలను, విధులకు అతీతమైన సేవలను గుర్తించి, గౌరవించాలనే ఉద్దేశంతోనే కమిషనరేట్ చరిత్రలోనే తొలిసారిగా 'ఎక్స్‌ట్రా మైల్'కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ గుర్తింపు పోలీసుల్లో నూతనోత్తేజాన్ని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రతి నెల జోనల్ స్థాయిలో..**

ఈ పురస్కారాలు ఇక్కడితో ఆగిపోవని, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపేందుకు ఇకపై ప్రతి నెల జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేస్తామని సజ్జనార్ తెలిపారు. గత ఆర్థిక ఏడాదికి సంబంధించిన 2, 3, 4వ త్రైమాసికాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఎక్స్ ట్రా మైల్ లో భాగంగా విధి నిర్వహణలో విధులకు అతీతంగా సేవలందించిన 271 మందికి ఈ పురస్కారం దక్కింది. గుడ్ వర్క్ డన్ లో భాగంగా విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 1,175 మందికి ఈ రివార్డులు వరించాయి.

# రక్షణ దళానికి 'ప్రత్యేక శాలరీ'

- టీజీఎస్పీఎఫ్ సిబ్బంది, వారి కుటుంబాలకు భద్రత
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం
- ప్రమాదాల్లో చనిపోతే రూ.కోటి నుంచి రూ.1.60 కోట్లు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (టీజీఎస్పీఎఫ్) సిబ్బందికి రాష్ట్ర సర్కార్ శుభవార్త చెప్పింది. రాష్ట్ర భద్రత కోసం పనిచేస్తున్న వీరికి పోలీస్ శాలరీ ప్యాకేజీ అమలు చేయాలని నిర్ణయించింది. టీజీఎస్పీఎఫ్ సిబ్బందికి ప్రత్యేకంగా రూపొందించిన పోలీస్ శాలరీ ప్యాకేజీ అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో టీజీఎస్పీఎఫ్ సిబ్బందికి, వారి కుటుంబాలకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం టీజీఎస్పీఎఫ్ సిబ్బంది ప్రమాదవశాత్తూ అనుకోకుండా ప్రాణాలు కోల్పోతే.. వారి కుటుంబ సభ్యులకు వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ.కోటి పరిహారం అందనుంది.విమాన ప్రమాదాల్లో చనిపోతే రూ.1.60 కోట్లు అందిస్తారు. శాశ్వత వైకల్యం పొందిన వారికి రూ.80 లక్షల వరకూ పరిహారంగా అందిస్తారు. టీజీఎస్పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ చనిపోతే..వారి పిల్లల ఉన్నత విద్య కోసం రూ.28 లక్షల సాయం అందిస్తారు. 1825 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఒకరికి మాత్రమే ఇది వర్తించనుంది.ఇద్దరు కుమార్తెల వరకూ పెళ్లి కోసం రూ. పది లక్షల వరకూ అందిస్తారు. ఒకరికి అయితే రూ. ఐదు లక్షలు.. ఇద్దరు ఉంటే రూ.10 లక్షల వరకూ అందిస్తారు.అలాగే గ్రూప్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద రూ.10 లక్షలు సౌకర్యం ఉంటుందని అధికారులు వెల్లడించారు. అదనపు ప్రయోజనాల కింద కాలిన గాయాల కేసుల్లో ప్లాస్టిక్ సర్జరీ కోసం గరిష్ఠంగా రూ.10 లక్షలు, విదేశీ మందుల రవాణా ఖర్చుల కోసం రూ.5 లక్షల వరకూ చెల్లిస్తారు. అంబులెన్స్ ఖర్చుల కింద గరిష్ఠంగా 50 వేలు అందిస్తారు. ఎయిర్ అంబులెన్సు ఖర్చుల కింద రూ.10 లక్షల వరకూ చెల్లిస్తారు. ప్రమాదం తర్వాత కోమాలో 48 గంటల కంటే ఎక్కువ ఉండి చనిపోతే.. ఐదు లక్షల వరకూ పరిహారం అందుతుందని అధికారులు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా అదనంగా రుణ సౌకర్యాలు, లాకర్ అద్దెపై రాయితీలు, ఖాతాదారులకు ప్లాటినం రూపే డెబిట్ కార్డు ప్రయోజనాలు కూడా లభించనున్నాయి.

# అర'చేతి'లో వైకుంఠం

- నమ్మి ఓటేశారంటే నెత్తిన భస్మాసుర 'హస్తం'
- తాండూరు ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ముద్ర, వికారాబాద్ :**



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని , మళ్లీ నమ్మి ఓటేశారంటే మన నెత్తిన భస్మాసుర హస్తం పెట్టడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపిన హస్తం పార్టీ.., అధికారంలో వచ్చాక తన నిజ స్వరూపాన్ని చూపిందని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీలు, హామీల అమలుపై నిలదీస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడమని, 420 హామీలు అమలయ్యే దాకా ప్రశ్నిస్తూనే ఉంటామని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ఉద్యోగాల పేరుతో యువతను కాంగ్రెస్ మోసం చేసిందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే... మున్సిపల్ ఎన్నికల్లోనూ అలాంటి అబద్ధాలాడి అయినా గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని కేటీఆర్ విమర్శించారు. మొదటిసారి మోసం చేస్తే తప్పు ఎదుటి వారిదవుతుంది.. రెండోసారి మోసపోతే తప్పు మనది అవుతుందని ఓటర్లను అప్రమత్తం చేశారు. రేవంత్ పాలనలో యూరియా కష్టాలు తప్పడం లేదని అన్నారు. చెప్పులు క్యూలైన్లలో పెట్టి ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించిందని విమర్శించారు. రైతుబంధు అడిగితే బూతులు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని బోగస్ మాట చెప్పిందని మండిపడ్డారు. ఫిబ్రవరి 8కి కూడా రైతుబంధు పడలేదని తెలిపారు. వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఇస్తామని మోసం చేశాడని, అత్తకు, కోడలికి ఇద్దరికీ రూ.2500 ఇచ్చిండా అని ప్రశ్నించారు. తులం బంగారం, రూ.4వేల పింఛన్, విద్యా భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500, స్కూటీలు ఇస్తామని అనేక హామీలు ఇచ్చిండని అన్నారు.



# ఈత పోటీల్లో ఖమ్మం వాసికి ద్వితీయ బహుమతి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**

విజయవాడలో ఆదివారం జరిగిన కృష్ణా రివర్ క్రాసింగ్ 1.5 కిలోమీటర్ల ఈత పోటీల్లో ఖమ్మం నుండి ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నుండి మొత్తం 22 మంది స్విమ్మర్లు పాల్గొన్నారు. వారిలో 71 ఏళ్ల పైబడిన వయస్సు కేటగిరీలో ఖమ్మం పట్టణానికి చెందిన సీనియర్ స్విమ్మర్ బోడేపూడి నాగేశ్వరరావు ద్వితీయ బహుమతి సాధించారని, ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోదాటి గిరి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కోదాటి గిరి మాట్లాడుతూ.. నాలుగు రాష్ట్రాల నుండి మొత్తం ఆరు వందల యాభై మంది స్విమ్మర్లు ఈత పోటీల్లో పాల్గొనగా, ఖమ్మం నుండి మొత్తం 22 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. పదేళ్ల చిన్నారుల నుండి 75 ఏళ్ల వృద్ధులు సైతం వయస్సును లెక్క చేయకుండా ఈత పోటీల్లో పాల్గొని ప్రదర్శన ఇచ్చారని వారందరికీ తమ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మందపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు తూము శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చాపలమడుగు నర్సింహారావు, ఎక్సిక్యూటివ్ సభ్యులు సుబ్రహ్మణ్యం శర్మ, గోవింద్ దారక్, ప్రవీణ్ కుమార్, తిరుపతయ్య,నల్లు వెంకట్ రెడ్డి, తాళ్లూరి శ్రీనివాసరావు, చిన్నారులు మోక్షజ్ఞ, భగత్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.






# ఆ రికార్డులు అక్కడ లేవు

- ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్ కేసుల ఆధారాలు సేఫ్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏడు ఫైల్స్ కాలిపోయాయి
- ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖాగోయల్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఈ నెల 7న.. నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్ కేసులకు సంబంధించిన ఆధారాలు మొత్తం కాలిపోయాయని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖాగోయల్ స్పష్టం చేశారు. 2024 పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో 136 మెటీరియల్స్ ఎఫ్ఎస్ఎల్‌కు వచ్చాయన్న ఆమె.. ఇందులో 7 మెటీరియల్స్ తాజా ప్రమాదంలో కాలిపోయాయని చెప్పారు. అయితే వాటిని రిట్రైవ్ చేస్తున్నామని చెప్పారు. మిగతావన్నీ సంబంధింత అధికారులకు అప్పగించామన్నారు. 2015లో ఏసీబీ నమోదు చేసిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన మెటీరియల్ ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లో లేదన్నారు. ఈ కేసులో 2015లో రెండు విడతల్లో 16 మెటీరియల్ ఆబ్జెక్టులు ఎఫ్ఎస్ఎల్‌కు అందాయని అదే ఏడాది వాటి నివేదికలను ఏసీబీ కోర్టుకు సమర్పించినట్టు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన 16 వస్తువులు ఇప్పటికే కోర్టుకు తిరిగి అప్పగించినట్టు తెలిపారు. ప్రమాదం జరిగిన ఫోరెన్సిక్ లాబొరేటరీస్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉదయం 10.08 గంటలకు ఎఫ్ఎస్ఎల్‌లో అగ్నిప్రమాదం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ అగ్నిప్రమాదంపై విచారణ జరుగుతోందనీ... జరిగిన ఆస్తినష్టంపై అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారని ఆమె చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్న ఆమె.. అగ్నిప్రమాదం సమయంలో ఎవరున్నారనే దానిపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. నష్టం అంచనాకు వచ్చాక వివరాలు వెల్లడిస్తామన్నారు. మంటలను మొదట ఎఫ్ఎస్ఎల్ ఉద్యోగి ఒకరు గుర్తించారని చెప్పారు. ల్యాబ్, ట్రైనింగ్ హాల్‌కు మంటలు వ్యాపించాయని చెప్పారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తే సాధ్యపడలేదన్నారు. మొదట ప్రాపర్టీ రూమ్‌లో పొగ, మంటలు చెలరేగాయని ఆ తర్వాత లైబ్రరీ, హెచ్‌ఆర్ డీ రూమ్‌కు వ్యాపించాయని వెల్లడించారు.

# ఓట్లడిగితే నిలదీయండి..

- ఒక్కో వృద్ధుడికి రూ.52వేలు కాంగ్రెస్ బాకీ
- మేం అన్నం పెడితే.. కాంగ్రెస్ మీకు సున్నం రాస్తుంది
- సదాశివపేటలో అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

**ముద్ర, సదాశివపేట :**



తాము అధికారంలో వస్తే రూ.2వేలు ఉన్న ఆసరా పెన్షన్ ను రూ.4వేలకు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్రంలో వృద్ధులకు ఒక్కొక్కరికీ రూ. 52వేలు బాకీ పడిందని అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వస్తున్న కాంగ్రెస్ లీడర్లకు తమకు రావల్సిన బాకీ డబ్బులు రూ.52 వేలు ఇవ్వాలని నిలదీయాలని అవ్వాతాతలకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన మెదక్ జిల్లా సదాశివపేటలో పర్యటించి.. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అన్నం పెట్టే కార్యక్రమాలు చేపడితే... ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు సున్నం పూస్తోందని విమర్శించారు. అన్నం పెట్టినోళ్లకు ఓటేస్తారో, సున్నం పూసినోళ్లకు ఓటేస్తారో..? తేల్చుకోవాలని ఓటర్లకు సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. ఏ ఒక్కరినీ వదలకుండా అన్ని వర్గాలనూ మోసం చేసిందని మండిపడ్డారు. బూతుల ముఖ్యమంత్రికి ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. సదాశివపేటలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని అనిపిస్తోందని హరీశ్ రావు అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ సర్కార్ ప్రజలకు చేసిందేమీ లేదన్న ఆయన భార్యకు బస్సు ఫ్రీ ఇచ్చి.. భర్తకు డబుల్ టికెట్ ఇచ్చారన్నారు. సదాశివపేట, సంగారెడ్డిలో మంచి ఆస్పత్రులు కట్టామని హరీశ్‌రావు తెలిపారు. బిడ్డ పుడితే రూ.13 వేలు ఇచ్చి అంబులెన్స్‌లో జాగ్రత్తగా ఇళ్ల వద్ద దించామని పేర్కొన్నారు. సదాశివపేటలో మంచినీటి కష్టాలు తీర్చింది కేసీఆర్ అని తెలిపారు. కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డల పెళ్లి రూ.లక్ష ఇచ్చామని పేర్కొన్నారు. సదాశివపేటలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని అనిపిస్తోందని హరీశ్ రావు అన్నారు. భార్యకు బస్సు ఫ్రీ ఇచ్చి.. భర్తకు డబుల్ టికెట్ ఇచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చి అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. బస్తీ దవాఖానాలు, వీధిలైట్లు, రోడ్లు, పార్కులు ఏర్పాటు చేశామని తెలిపారు. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్ల స్మశానవాటికలకు రూ.5 ఎకరాల చొప్పున ఇచ్చామని పేర్కొన్నారు.

# వాళ్లకు ఓటేస్తే.. మీకు చేటు

- కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదు..
- బీఆర్ఎస్ కు అధికారం లేదు
- జనగామ, స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారంలో ఈటెల

**ముద్ర, జనగామ:**



రాష్ట్రంలో అధికారంలో ఉండీ అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్.. కేంద్రంలో అసలే ప్రాతినిధ్యం లేని బీఆర్ఎస్ కు మున్సిపల్ ఎన్నికల్లో ఓటేస్తే ఎలాంటి లాభం లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. ఎన్నికల్లో ఆయా పార్టీ నేతలు ఎవరైనా ఓట్ల కోసం మీ దగ్గరికి వస్తే నిలదీయాలని ఓటర్లకు సూచించారు. మున్సిపాలిటీలో పనిచేసిన వారికి నాలుగేళ్లుగా బిల్లులు ఇవ్వడం లేదన్న ఈటల.. పాతవారికి ఇవ్వడానికే డబ్బులు లేకపోతే కొత్తగా అభివృద్ధి ఏం చేస్తారని ప్రశ్నించారు ? ఓటు వేయండి పని చేస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసే సత్తా ఒక్క భారతీయ జనతా పార్టీకి మాత్రమే ఉందన్నారు. ఆదివారం జనగామ, స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారంలో ఈటెల పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో లేదనీ.. కేంద్రంలో ఒక ఎంపీ కూడా లేరన్నారు. అభివృద్ధి పనుల కోసం ఆ పార్టీ ఎమ్మెల్యే దగ్గరికి పోతే.. నాది అధికార పార్టీ కాదు నిధులు తీసుకురాలేను అని నిస్సహాయ వ్యక్తం చేస్తున్న దుస్థితి నెలకొందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఏం చేయలేకపోతే.. పార్టీ బరిలో నిలిపిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తే ఏమన్నా ఉపయోగం ఉంటుందా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అనేక సభలు పెట్టిందన్నారు. రైతు, బీసీ, యువ పాలసీల పేర్లతో సభలు నిర్వహించిందన్నారు. ఆడబిడ్డలకు రూ.2500 ఇస్తామని ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్.... ఇప్పటి వరకు ఏ ఒక్క ఆడబిడ్డకైనా ఇచ్చిందా.? అని ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మికి తులం బంగారం, చదువుకునే పిల్లలకు స్కూటీ ఇవ్వడంతో పాటు పెన్షన్లు పెంచుతామనీ పథకాలకు అవసరమైన నిధులకు ఎలాంటి కొదవలేదన్నారు. ఒక ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. స్మార్ట్ సిటీ, అమృత్ నగరాల పేరిట రూ. వేల కోట్లు విడుదల చేసి రోడ్లు, మోరీలు నిర్మిస్తున్నారన్నారు. అంగన్వాడీ సెంటర్లు, ఆశా వర్కర్ల జీతాలను కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందన్నారు.. రూ. 40 కోట్లతో జనగామ రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేశామని ఈటల అన్నారు. జనగామ మున్సిపాలిటీ ఏర్పడి 74 ఏండ్లయినా తాగునీటి సరఫరా జరగక ప్రజలు డబ్బులు పెట్టి వాటర్ క్యాన్లు కొనుక్కునే దుస్థితి నెలకొందన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 09.02.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## న_కలం

### క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏంటీ?

# దాంతో ఏంటి ప్రయోజనం?



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సరికొత్త చరిత్రకు వేదికైంది. ఐటీ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు అమరావతిని భవిష్యత్ టెక్నాలజీ 'క్వాంటం కంప్యూటింగ్'కు గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేశారు. శనివారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో దేశంలోనే మొట్టమొదటి 'అమరావతి క్వాంటం వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

**సిలికాన్ వ్యాలీ గతం.. క్వాంటం వ్యాలీ వర్తమానం!**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "గతంలో సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాంది పలికితే రాబోయే రోజుల్లో క్వాంటం వ్యాలీ ప్రపంచాన్ని శాసించబోతోంది. హైదరాబాద్‌కు హైటెక్ సిటీ ఎలాగో, దేశానికి అమరావతి క్వాంటం వ్యాలీ అలా గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి అమరావతిలో దేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తెస్తాం" అని ప్రకటించారు.

**ప్రాజెక్టు ప్రత్యేకతలు:**

సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. 48 అంతస్తులు, 29 అంతస్తులతో కూడిన ఎనిమిది భారీ టవర్లను నిర్మిస్తున్నారు. ఐబీఎం , టీసీఎస్ , ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్నాయి. 2030 నాటికి దేశానికి అవసరమైన 2.5 లక్షల క్వాంటం నిపుణులలో మెజారిటీ వాటా అమరావతి నుంచే ఉండేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

**ఎందుకు ఈ క్వాంటం టెక్నాలజీ?**

సాధారణ కంప్యూటర్లు సంవత్సరాల తరబడి చేసే క్లిష్టమైన లెక్కలను క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. దీనివల్ల వాతావరణ అంచనాలు, క్యాన్సర్ వంటి వ్యాధులకు కొత్త మందుల తయారీ, హ్యాకింగ్‌కు గురికాని సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

**అరుదైన పురస్కారం.. ₹100 కోట్ల బహుమతి!**

పరిశోధనలను ప్రోత్సహించేందుకు చంద్రబాబు ఒక సంచలన ప్రకటన చేశారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో ఎవరైనా నోబెల్ బహుమతి సాధిస్తే వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ₹100 కోట్ల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అమరావతే నాలెడ్జ్ హబ్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఫిబ్రవరి 9, బాబా ఆమ్టే వర్ధంతి సందర్భంగా..

# బాబా ఆమ్టే - ఒక పసి హృదయం రగిల్చిన సేవా జ్యోతి

దీపావళి పండుగ వేళ.. ఊరంతా విద్యుత్ దీపాల వెలుగులు, టపాసుల సందడి. ఆ చిన్నారి బాలుడి చేతిలో తన తల్లి ప్రేమగా ఇచ్చిన కొన్ని నాణేలు ఉన్నాయి. ఆ డబ్బుతో మిఠాయిలు, రంగుల బాణసంచా కొనుక్కోవాలన్న ఉత్సాహంతో దుకాణం వైపు పరుగు తీస్తున్నాడు. కానీ, ఆ సందడిని చీలుస్తూ ఒక దీనమైన అరుపు అతని చెవిన పడింది. "ఈ అంధుడికి ఒక్క పైసా వేయండి భగవాన్.. పుణ్యం ఉంటుంది!" ఆ అరుపులో ఆకలి ఉంది, అంతకు మించి అంతులేని నిస్సహాయత ఉంది. బాలుడు ఆగిపోయాడు. తన చేతిలో ఉన్న నాణేల వైపు చూసుకున్నాడు.. అటు తన ఆశలు, ఇటు ఒకరి ఆకలి. క్షణం కూడా ఆలోచించకుండా, తన దగ్గరున్న నాణేలన్నింటినీ ఆ బిచ్చగాడి అల్యూమినియం డబ్బాలో వేశాడు. కానీ, ఆ నాణేలు డబ్బాలో పడినప్పుడు వచ్చిన 'గల్ గల్' శబ్దాన్ని విన్న ఆ బిచ్చగాడు సంతోషించలేదు. పైగా ముఖమంతా భయంతో వణికిపోతూ, "బాబు.. నాకు కళ్లు లేవు కదా అని ఎగతాళి చేయకండి. నా డబ్బాలో రాళ్లు వేసి నన్ను ఏడిపించకండి నాయనా!" అని కన్నీళ్లతో వేడుకున్నాడు. ఆ మాటలు ఆ బాలుడి గుండెను మెలిపెట్టాయి. ఆ చిన్నారి వెంటనే ఆ బిచ్చగాడి చేతులు పట్టుకుని, "తాతా! ఇవి రాళ్లు కాదు, నిజంగా నాణేలే! నన్ను నమ్ము.. కావాలంటే తడిమి చూడు" అన్నాడు ఆవేదనగా. బిచ్చగాడు వణుకుతున్న చేతులతో ఆ నాణేలను స్పర్శించాడు. అవి నిజంగానే డబ్బులని తెలియగానే, అతని కళ్ల నుండి ఆనందబాష్పాలు రాలాయి. ఆ దృశ్యం చూసిన బాలుడి కళ్లు చెమర్చాయి. పండుగ పూట ఒక మనిషి ఆకలి కంటే, అతను ఎదుర్కొంటున్న అపనమ్మకం, సమాజంపై అతనికి ఉన్న భయం ఆ బాలుడిని కుదిపేసింది. ఏడుస్తూనే ఇంటికి పరిగెత్తిన ఆ చిన్నారి, "పెద్దయ్యాక ఇలాంటి అభాగ్యుల కోసం నా జీవితాన్ని అంకితం చేస్తాను" అని తన పసి మనసులో ప్రమాణం చేసుకున్నాడు. ఆ పసి హృదయమే కాలక్రమంలో ఒక మహా వృక్షమై, కుష్టు వ్యాధిగ్రస్తుల పాలిట దైవమై నిలిచింది. ఆయనే బాబా ఆమ్టే. తన జీవితం మొత్తాన్ని సమాజం వెలివేసిన వారి కోసం ధారపోసిన ఆ మహనీయుడి కథ నేటి తరానికి ఒక గొప్ప పాఠం!

**కుష్టు వ్యాధిపై కరుణా యుద్ధం: మానవతా మూర్తి బాబా ఆమ్టే:**

మురళీధర్ దేవీదాస్ ఆమ్టే. ప్రపంచం ప్రేమగా 'బాబా' అని పిలుచుకుంది. 1914 డిసెంబర్ 26న మహారాష్ట్రలోని ఒక సంపన్న జమీందారీ కుటుంబంలో జన్మించి చిన్నతనంలోనే అపారమైన భోగభాగ్యాలు దక్కాయి. కానీ ఆ విలాసవంతమైన జీవితం ఆత్మను తృప్తిపరచలేదు. వెండి పళ్ళెంలో భోజనం చేసే స్థాయి నుండి, సమాజం అసహ్యించుకునే అణగారిన వర్గాల కోసం తన జీవితాన్నే త్యాగం చేసే స్థాయికి ఆయన ప్రయాణం ఒక అద్భుతం. తమ ఇంటి గుమ్మం దాటి బయట ప్రపంచంలోని పేదరికం, కన్నీళ్లు లోపలికి రాకుండా నిర్మించుకున్న గోడలను బద్దలు కొట్టారు.

సమాజం ఎవరినైతే 'పాపులు'గా, 'అంటరానివారు'గా చూసి దూరంగా నెట్టేసిందో, ఆ కుష్టు రోగుల కన్నీటిని తూడ్చడానికి కంకణం కట్టుకున్నారు. కుష్టు వ్యాధి అంటే ప్రాణాంతకమైన అంటువ్యాధి అని భయపడి, కన్నవారే రోగులను అడవుల్లో వదిలేస్తున్న కాలమది. ఆ అజ్ఞానపు చీకట్లను తొలగించడానికి బాబా ఆమ్టే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. కుష్టు వ్యాధి అంటువ్యాధి కాదని నిరూపించడానికి, ఒక రోగి శరీరం నుండి బ్యాక్టీరియాను తీసుకుని తన సొంత శరీరంలోకి ఇంజెక్ట్ చేయించుకున్నారు. తన ప్రాణాలను పణంగా పెట్టి




చేసిన ఆ త్యాగం, లక్షలాది మందిలో ధైర్యాన్ని నింపింది. బాధితుల మధ్యే నివసిస్తూ, వారి పుండ్లను కడుగుతూ, వారికి వైద్యంతో పాటు 'మనుషులం' అనే గౌరవాన్ని ప్రసాదించారు. వారి కళ్ళలో దుఃఖాన్ని తుడిచి, ఆ చేతులకు హస్తకళల్లో శిక్షణనిచ్చి, వారు తయారు చేసిన వస్తువుల ద్వారా గౌరవప్రదమైన ఉపాధిని కల్పించారు. శవంలా పడి ఉన్న రోగులను, దేశానికి సంపదను సృష్టించే కార్మికులుగా మార్చిన ఆ మహనీయుని కృషి చిరస్మరణీయం.

**మూడు ఆశ్రమాల స్థాపన:**

మహారాష్ట్రలోని కుష్టు రోగులు, దివ్యాంగులు, నిరుపేద ప్రజల సంరక్షణ, పునరావాసం కోసం బాబా ఆమ్టే మూడు ఆశ్రమాలను స్థాపించారు. 1949 ఆగస్టు 15న ఆయన తన భార్య సాధన ఆమ్టేతో కలిసి ఆనందవన్‌లో ఒక చెట్టు కింద కుష్టువ్యాధి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సంస్థ కుష్టు వ్యాధిగ్రస్తులు, శారీరక వైకల్యాలు, దృష్టి, వినికిడి లోపాలు ఉన్నవారు, అలాగే ఆదిమ గిరిజనులతో సహా వేలాది మంది వెనుకబడిన ప్రజలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా చేయడంలో కీలక పాత్ర పోషించింది. అనంతరం 1973లో గడ్చిరోలి జిల్లాలోని 'మాడియా గోండ్' గిరిజనుల కోసం 'లోక్ బిరాదరి ప్రకల్ప్'ను స్థాపించారు.

**ఆధునిక భారతదేశ గాంధీ- బాబా ఆమ్టే:**

బాబా ఆమ్టే గాంధీజీ సిద్ధాంతాలను నమ్మి, వాటిని పూర్తిగా ఆచరించిన మహనీయుడు. గాంధీజీతో పరిచయమైన తర్వాత, కొద్దిరోజుల పాటు సేవాగ్రామ్ ఆశ్రమంలో గడిపారు. గాంధీజీ శిష్యుడిగా మారి, ఆయన సిద్ధాంతాలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నారు. న్యాయశాస్త్రంలో శిక్షణ పొంది భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో వలస ప్రభుత్వం ఖైదు చేసిన భారత నాయకుల తరపున డిఫెన్స్ న్యాయవాదిగా పనిచేశారు. ఆ సమయంలోనే గాంధీజీ బాబా ఆమ్టేకు 'అభయసాధక్' అనే బిరుదును ఇచ్చారు. కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల భయం లేకుండా, వారి సంక్షేమం కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఆ బిరుదు లభించింది. బాబా ఆమ్టే జీవనశైలిపై గాంధీజీ ప్రభావం ఎంతో ఉంది. శేష జీవితాన్ని అణగారిన వర్గాల కోసమే కేటాయించడమే కాకుండా, నిరాడంబరంగా ఖద్దరు వస్త్రాలనే ధరించేవారు. ఈ విషయంలో వీరిద్దరి మధ్య ఎంతో సామ్యం కనిపిస్తుంది. అంతేకాకుండా, ఆశ్రమాల్లో గడుపుతూ పూర్తి శాకాహార భోజనంతో క్రమశిక్షణతో కూడిన జీవనం గడిపారు. గ్రామాలు స్వయంసమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ అవినీతిని, అసమర్థతను, దూరదృష్టి లేని ప్రణాళికలను ఎండగట్టడానికి ఆమ్టే ఎల్లప్పుడూ గాంధీ మార్గాన్నే అనుసరించారు. అందుకే ఆయనను 'ఆధునిక భారతదేశ గాంధీ' అని పిలుస్తారు.

ఎన్నో పోరాటాలు – ఆరాటాలు:

బాబా ఆమ్టే అనేక సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. 1985లో ఆయన 'నిట్ ఇండియా' మిషన్ ప్రారంభించారు. 72 ఏళ్ల వయసులో కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు 3,000 మైళ్లకు పైగా నడిచి, భారతీయులలో ఐక్యతా భావాన్ని పెంపొందించారు. మూడు సంవత్సరాల తర్వాత, అస్సాం నుండి గుజరాత్ వరకు 1,800 మైళ్లకు పైగా పర్యటించి రెండో విడత యాత్రను పూర్తి చేశారు. గాంధీజీ మార్గంలో నడుస్తూ, మేధా పాట్కర్ గారితో కలిసి నర్మదా బచావో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. నర్మదా ఆనకట్ట వల్ల నిర్వాసితులైన ప్రజల హక్కుల కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం అహింసాయుత పోరాటం చేశారు. బాబా కుమారులైన వికాస్, ప్రకాష్ ఇద్దరూ తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. ప్రకాష్ ఆమ్టే, ఆయన భార్య మందాకిని ఆమ్టే చేసిన సేవలకు గుర్తింపుగా 2008లో వారికి సంయుక్తంగా 'రామన్ మెగసెసే' అవార్డు లభించింది.

**అవార్డులు - పురస్కారాలు:**

సంపన్న కుటుంబంలో జన్మించినా, భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల కోసం చేసిన కృషి అనన్యసామాన్యం. ఈ సేవలను గుర్తించి ప్రభుత్వం 1971లో పద్మశ్రీ, 1986లో పద్మవిభూషణ్ పురస్కారాలతో గౌరవించింది. అలాగే 1985లో రామన్ మెగసెసే, 1999లో గాంధీ శాంతి బహుమతి లభించాయి. తనకు లభించిన అవార్డుల నగదును కూడా సమాజ సేవకే వినియోగించడం విశేషం.

2008 ఫిబ్రవరి 9న బాబా ఆమ్టే తన ఆశ్రమం 'ఆనంద్‌వన్'లో కన్నుమూశారు. నిస్వార్థ సేవకు మారుపేరుగా నిలిచిన ఆయన ఆశయాలను మనం ముందుకు తీసుకెళ్లాలి.

డి జయరాం
9440485824



# ఆదివాసీల కోసం ప్రశ్నించే గొంతుక

ఆదివాసీల కోసం గర్జించే గళం అరుణ్ కుమార్ ములుగు జిల్లా తాడ్వాయి మండలం కామరాం గ్రామం లో జన్మించారు. చిన్నతనంలో ఎదురైన కష్టాలను అధిగమించి, ఆదివాసీల హక్కులు మరియు సంస్కృతి పట్ల ఉన్న అంకితభావం, పరిశోధనాత్మకతను ప్రధాన ప్రతిభగా కలిగి ఉండేవారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించడం.. ఈ కష్టాలన్నిటినీ తట్టుకుని, ప్రభుత్వ గిరిజన సంక్షేమ సంస్థలు, హాస్టళ్లలో తన విద్యను కొనసాగించారు.

**గిరిజన ఉద్యమాల పట్ల ఆసక్తి:** చాలా చిన్న వయస్సులోనే గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను, ఉద్యమాలను దగ్గరగా చూసి, వాటి పట్ల ఆసక్తి పెంచుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ గిరిజన ప్రాంతాలు మరియు కమ్యూనిటీల గురించి తెలుసుకోవడానికి విస్తృతంగా ప్రయాణించారు.

**పరిశోధన మరియు చదువు:** చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ఆయన, కాకతీయ విశ్వవిద్యాలయం నుండి "ఐదవ మరియు ఆరవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజన అభివృద్ధి పరిపాలన – ఒక తులనాత్మక అధ్యయనం" అనే అంశంపై డాక్టరేట్ (PhD) పొందారు.

**ఆదివాసీ సంస్కృతిపై కృషి:** ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడటం, వారి సంస్కృతిని ప్రోత్సహించడం అతని ప్రధాన లక్ష్యంగా ఉండేది. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో ఆదివాసీ మూలాల బొమ్మలు, శిల్పాలు చెక్కించే ప్రక్రియలో చురుకుగా పాల్గొని తన ప్రతిభను ప్రదర్శించారు. ఈ విధంగా, మైపతి అరుణ్ కుమార్ తన చిన్ననాటి కష్టాల నుండి స్ఫూర్తి పొంది, విద్య మరియు సామాజిక సేవ రంగాలలో, ముఖ్యంగా ఆదివాసీ హక్కుల పరిరక్షణలో తన ప్రత్యేక ప్రతిభను చాటారు. ప్రస్తుతం, అతను 'తుడుం దెబ్బ' అనే ఆదివాసీ సామాజిక–సాంస్కృతిక సంస్థకు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉంటూ, వారి హక్కుల కోసం పోరాడుతున్నారు.

**సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకులు అరుణ్ కుమార్.**

డాక్టర్ మైపాతి అరుణ్ కుమార్ గిరిజన కోయ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రపై పరిశోధన చేయడానికి ఈ సంస్థను స్థాపించారు. మేడారం జాతర స్థలంలో పునరుద్ధరణ పనులను పర్యవేక్షించేటప్పుడు, ప్రభుత్వ అధికారులు సాంప్రదాయక నమూనాలను కనుగొనడానికి ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని, తన సంస్థ ద్వారా సేకరించిన తాళపత్ర గ్రంథాల నుండి 7,000 పురాతన చిత్రాలను అందించారు. ఈ పరిశోధన ఆధారంగానే మేడారం ఆలయ రూపకల్పన జరిగింది. సమ్మక్క సారలమ్మ గద్దెల శాశ్వత నిర్మాణంలో డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఆయన పాత్ర ప్రధానంగా ఈ నిర్మాణానికి సంబంధించిన చారిత్రక, సాంస్కృతిక, సంప్రదాయపరమైన మార్గదర్శకత్వం అందించడంలో క్రియాశీలక పాత్ర పోషించాయి.డాక్టర్ అరుణ్ కుమార్ రెండు దశాబ్దాలుగా వన దేవతల చరిత్రపై పరిశోధన చేస్తున్నారు. ఈ నిర్మాణం, ముఖ్యంగా రాతి స్తంభాలు మరియు శిల్పాల రూపకల్పనలో కోయ తెగల చరిత్ర, సంస్కృతి, స్థానిక పురాణాలను ప్రతిబింబించేలా ఆయన తన పరిశోధనల ఆధారంగా సూచనలు అందించారు.గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా: కొత్తగా నిర్మించిన గద్దెల ప్రాంగణంలో కోయ తెగల సంప్రదాయాలు మరియు కళాకృతులను పొందుపరచడానికి, గిరిజన పూజారులందరి సమ్మతితో ఆయన మార్గదర్శకత్వం వహించారు.

**పూజారి, సలహాదారు:, జాతర నిర్వహణ ఏర్పాట్లపై సలహాలు, సూచనలు ఇస్తుంటారు.**

నిర్మాణ పనులు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగాయి, అయితే ఈ మొత్తం ప్రక్రియలో సాంస్కృతిక మరియు చారిత్రక ప్రామాణికతను నిర్ధారించడంలో అరుణ్ కుమార్ పాత్ర చాలా ముఖ్యమైనది. సమ్మక్క సారలమ్మ గద్దెల పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి బాధ్యత లు అప్పగించారు అతను సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకుడు మరియు కోయ తెగ సంస్కృతి మరియు చరిత్రపై పరిశోధన చేస్తున్నారు. మేడారం గద్దెలు శిల్పుల పనులలో అరుణ్ కుమార్ పర్యవేక్షణ మరియు సలహాలు కీలక పాత్ర పోషించాయి.మేడారం గద్దెల పునర్నిర్మాణంలో డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ నేతృత్వంలోని బృందం కీలక పాత్ర పోషించింది. డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ దశాబ్దాలుగా (సుమారు 15–20 సంవత్సరాలు) వన దేవతల చరిత్రపై పరిశోధన చేస్తున్నారు.గిరిజన సంస్కృతి ప్రతిబింబం: గద్దెల పునర్నిర్మాణంలో ఆదివాసీ కోయ తెగల ఆచారాలు, సంప్రదాయాలు, జీవనశైలి మరియు వనదేవతల ఇతిహాసాలను ప్రతిబింబించేలా సుమారు 7,000 శిల్పాలను, 50కి పైగా రాతి పలకలను రూపొందించడంలో ఆయన బృందం సహాయం అందించింది.పూజారులతో సమన్వయం చేసుకుంటూ గద్దెలపై చెక్కవలసిన చిహ్నాలను (గొత్రాలు, కోయ తెగల గుర్తులు) ఎంపిక చేయడానికి గిరిజన పూజారులందరి సమ్మతి మరియు సలహాలు తీసుకున్నారు.

**నిర్మాణ రూపకల్పన:** ఈ బృందం అందించిన పరిశోధన ఆధారంగా, ఆర్కిటెక్ట్‌లు పర్యవేక్షణలో 250 మంది శిల్పులు ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటి, ఆళ్లగడ్డ ప్రాంతాల నుండి సేకరించిన తెల్ల గ్రానైట్ రాయిపై శిల్పాలను చెక్కారు. మేడారం ఆలయ ప్రాంగణం మరియు జాతర అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ డిజైన్‌లో కూడా అరుణ్ కుమార్ బృందం పాలుపంచుకుంది. ఈ పునర్నిర్మాణ పనులను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పనుల పురోగతిని సమీక్షించి, 100 రోజుల గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు మొత్తం ప్రభుత్వ ఆధ్వర్యంలో గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా జరిగాయి. శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఆసియా ఖండం లోని అతి పెద్ద గిరిజన జాతరగా ప్రాచుర్యం పొందింది ఇట్టి సంస్కృతి సంప్రదాయాలు దేశ నలుమూలల అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిదూటకు గద్దెల పునర్నిర్మాణం చేయడం జరుగుతుంది. సమ్మక్క సారలమ్మ దేవతలు తెలంగాణ ప్రజల ప్రతిక ఆత్మగౌరవంగా నిలిచిన సందర్భం చూస్తున్నాం కోయ సంస్కృతి మౌకిక సాహిత్యం కాకుండ లిఖిత పూర్వం కంగా ఉన్న చరిత్ర అని ప్రపంచనీకీ చాటి చెప్పి ప్రయత్నం.. అనేక మంది భక్తుల కోరిక మేరకు, చరిత్ర కారుల సలహా తో, మేధావుల సహకారం, పూజారుల అనుమతి తొ పునరాధరణ చేయడం జరుగుతుంది

అరుణ్ కుమార్ నాయకత్వం లో శ్రీ సమ్మక్క సారలమ్మ ఇండిజినియస్ ఆర్కియాలజికల్ రిసర్చ్ సెంటర్ వారి పరిశోధన గ్రంధాల ఆదరంగా 150 వేల్పుల తలపుతుల నుండి సేకరించిన సమాచారం తో యూనివర్సిటీ మేధావుల పునఃపరిశీలన చేసిన తర్వాత ప్రతి బొమ్మ నీ చారిత్రిక ఆధారాలు తో పొందుపరచడం జరిగింది ఎలాంటి విమర్శలకు తావు రాకుండా ఒకటికి పదిసార్లు ఆలోచన చేసి కోయ వేల్పుల గొట్టు గోత్రాలు పొందుపరచడం జరిగింది అధ్యయన కారులకు ఎలాంటి సందేహం ఉన్న వారికీ పుస్తక రూప లో త్వరలోనే అందిస్తాం అన్నారు కుల మతాలకు అతీతంగా భక్తుల మనోభావాలకు అనుగుణంగా చారిత్రిక అంశాలు ఆధారాలతో పొందుపరిచేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిజేశారు.

గద్దెల పునర్నిర్మాణంలో సుమారుగా 4 000 టన్నులకు పైగా వినియోగిస్తున్నారు. 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 46 భారీ గ్రానైట్ రాతి స్తంభాల నిర్మిస్తున్నారు. భక్తులు దర్శించుకునే స్తంభాలను ఏర్పాటు చేసి వెదురు ఆకృతులను కోయ సంప్రదాయం జీవకళల ప్రకృతి రమణీయంగా తీర్చిదిద్దుతున్నారు. 59 శిల్పాలను సమ్మక్క వంశానికి చెందిన వాటిని ప్రతిష్టించారు.ఈ పరిసర ప్రాంతంలో 7000 కోయ సంస్కృతిని సంబంధించిన వంశ చరిత్రకు సంబంధించిన శిల్పాలు 750 కోయ వంశాల పేర్లను సూచించేలా తీర్చిదిద్దారు. భారీ తోరణాలను ఆలయానికి సొగసులు అద్దెల వివిధ పరిమాణాలలో ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. 50 అడుగుల ఎత్తులో ఉన్న ఒక ప్రధాన తోరణం, 40 అడుగుల ఎత్తులో ఉన్న మూడు తోరణాలు,30 అడుగుల ఎత్తులో ఉన్న ఐదు ప్రత్యేక తోరణాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటిని 250 మంది నిపుణులైన శిల్పులు చెక్కుతున్నారు. ఈ భారీ ఆదివాసి చరిత్ర నిర్మాణానికి డాక్టర్ హరిప్రసాద్ నేతృతం వహిస్తున్నారు. 1000 సంవత్సరాల చరిత్రను వెలికి తీయడంలో మైపతి అరుణ్ కుమార్ నాయకత్వం లో శ్రీ సమ్మక్క సార్లమ్మ ఆర్కేయాలజి సంస్థ వారి శ్రమ ఫలిస్తున్నది. మౌఖిక రూపంలోఉన్న కథకు ,తాళ పత్ర గ్రంధాలు కూడా ఈ నిర్మాణానికి వెన్నుదన్నుగా నిలుస్తూ గొప్ప చరిత్రను నిలబెడుతున్నాయి. ఇందులో ఎటువంటి అనుమానాలు ఉన్న సందేహాలకు తావివ్వకుండా ఉండేందుకు, ఈ రీసర్చ్ సెంటర్ ను సందర్శించి నివృత్తి చేసుకోవచ్చు. త్వరలో ఈ చరిత్రను తెలిపే గైడ్లను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటుంది ఎవరికి కూడా ఇలాంటి అనుమానాలు అవసరం లేదు చరిత్ర ఆధారంగానే ఇక్కడ నిర్మాణం జరుగుతుంది. 12 రకాల పవిత్రత గల వృక్షాలను, 140 రకాల ఔషధ మొక్కలను నాటుతో సంజీవని వనాన్ని ఇక్కడ ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నారు.

జాతర యొక్క విశిష్టతను తెలియజేసేందుకు సమ్మక్క తల్లి గద్దెల కు చేరుకున్న ప్రధాన ద్వారం అడ్డంగా రెండు వరుసలలో 18 దుప్పుల చిహ్నాలు నెలవంక ,ఏనుగు చిత్రం, ఆదిశక్తి పులి, తూత కొమ్ము, చక్రం ,రంభ ,నాగుపాము ,కల కోడి, కలక తామర పువ్వు, సూర్యచంద్రులు , జింక,సింహం, మనుబోతు ,త్రిశూలం, వంటికొమ్ము దుప్పి, ఖడ్గ మృగం ,ఎద్దు , ఎండి ముక్కు ,కొకడి వంటి చిత్రాలను చెక్కించి శిల్పాలను అమరుస్తున్నారు.ప్రపంచం చరిత్ర నూ తల తన్నే విధంగా, దేశ చరిత్ర లో గద్దెలు పునరుద్ధరణ చిర స్థాయిలో నిలిచి పోతుంది. అరుణ్ కుమార్ కృషి మేధస్సు మేడారం జాతర లో అత్యంత వైభవం గా వెలిగి పోతుంది. ఆదివాసీ సమాజం లో ఇలాంటి ఆదివాసీ మేధావి చాలా అరుదుగా కనిపిస్తారు.ఇలాంటి ఆదివాసీ మేధావి కీ జన్మనిచ్చిన తల్లిదండ్రులు నిజం గా గొప్ప వ్యక్తులు. వాళ్ళు ఏ జన్మ లో చేసుకున్న పుణ్యం మో ఇలాంటి మేధావి నీ కన్నారు. ఇలాంటి ఆదివాసీ మేధావి నీ గుర్తించి తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అసెంబ్లీ కీ లేదా పార్లమెంట్ కీ పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆదివాసీలు భావిస్తున్నారు. లేదా ఒక మంచి గౌరవప్రదమైన పదవి ఇచ్చి గౌరవించాల్సిన అవసరం ఉందని ఆదివాసీ సమాజం బావిస్తుంది.



వూకె రామకృష్ణ దొర.
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. తెలంగాణ
9866073866

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
09.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు**

సత్యం స్కామ్ (హైదరాబాద్): ఐటీ దిగ్గజం రామలింగరాజు 2009లో సుమారు 7,000 కోట్ల రూపాయల ఆర్థిక మోసానికి పాల్పడినట్లు ఒప్పుకోవడం కార్పొరేట్ రంగంలో సంచలనం సృష్టించింది. ఇది భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద అకౌంటింగ్ మోసాలలో ఒకటిగా నిలిచింది.




# రెండేళ్లలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది

- **కేసీఆర్ తిరిగి సీఎం అవుతారు: కేటీఆర్**

**ముద్ర, తాండూర్:**




రెండేళ్లలో తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ జిల్లా తాండూర్‌లో ఆదివారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నిత్యం మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించడమే తప్ప పాలనపై దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఈ హామీల్లో ఒక్కటైనా అమలు కాలేదని, ప్రజలు ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు.

**గ్యారెంటీలపై గుణపాఠం తప్పదు..**

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు అభయ హస్తం కింద మహిళలకు నెలకు రూ.2,500, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, వృద్ధులకు రూ.4,000 పింఛన్ వంటి హామీలన్నీ గాలికే వదిలేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఈ మోసపూరిత వాగ్దానాలకు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండూ ఒక్కటేనని వ్యాఖ్యానించారు. బీజేపీకి ఓటేస్తే పరోక్షంగా కాంగ్రెస్‌కు ఓటేసినట్టేనని అన్నారు.

**తాండూర్‌కు అన్యాయం జరిగింది..**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తాండూర్‌కు మంజూరైన నర్సింగ్ కాలేజీని సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్‌కు తరలించారని ఆరోపించారు. తాండూర్ అభివృద్ధి పేరుతో రూ.1,000 కోట్లు ఇస్తామని మళ్లీ మాయ మాటలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సీఎం అయినా పర్యటనల్లో అభివృద్ధిపై మాట్లాడతారని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం రోజూ కేసీఆర్‌పై దూషణలకే పరిమితమవుతున్నారని అన్నారు. తాండూర్ అభివృద్ధి కావాలంటే కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కేటీఆర్ కోరారు.

**రూ.1680 కోట్లతో అభివృద్ధి : రోహిత్ రెడ్డి**

మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో తాండూర్ ప్రాంతానికి రూ.1,680 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మాతాశిశు ఆస్పత్రి, ఐటీఐ కళాశాల, రూ.16 కోట్లతో చిలుకవాగు పనులు, పాత తాండూర్ రైల్వే బ్రిడ్జి వంటి పనులు చేపట్టి ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ రోడ్‌షోలో బీఆర్ఎస్ తాండూర్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీశైల్ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజు గౌడ్, తాండూర్ బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నరసింహులు, మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల దీప, శ్రీనివాస్ చారి, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి తీరని లోటు

- **కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ సరస్వతి మృతి**

**ముద్ర, హైదరాబాద్ :**



చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సీఆర్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో నడుస్తున్న హోం ఫర్ ఏజ్డ్ వృద్ధాశ్రమంలో గత 21ఏళ్ళుగా నివసిస్తున్న డాక్టర్ పి. సరస్వతి(90) శనివారం కన్నుమూశారు. కంటి వైద్య నిపుణురాలిగా సరోజినీ దేవి హాస్పిటల్‌లో సేవలందించి పదవీ విరమణ పొందిన ఆమె, జీవితాంతం సమాజ సేవకే అంకితమయ్యారు. డాక్టర్ పబ్బరాజు సరస్వతిసుబ్బారావు దంపతులు 2004లో సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో చేరగా, సుబ్బారావు 2009లో మృతిచెందారు. ఆ తర్వాత కూడా ఆశ్రమంలోనే ఉంటూ సీఆర్ ఫౌండేషన్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కార్యక్రమాలకు డాక్టర్ సరస్వతి అనేక విధాలుగా తోడ్పాటు అందించారు. సీ ఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్యురాలిగా 11ఏళ్ళ పాటు ఉచిత సేవలు అందించారు. డాక్టర్ సరస్వతి పార్థివ దేహాన్ని నేటి ఉదయం 10గంటలకు సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం ఆవరణలో ఉంచుతారు. 11గంటలకు ఆమె పార్థివ దేహాన్ని గాంధీ మెడికల్ కాలేజ్‌కు ఆమె కుమారుడు శ్రీనివాస్ అప్పగించనున్నారు. విద్యార్థుల వైద్య విద్య అవసరాల నిమిత్తం తన భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజ్‌కు దానం చేయాలని ఆమె గతంలోనే రాతపూర్వకంగా ప్రకటించారు. ఆమె మృతి పట్ల సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ, ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకటరెడ్డి, సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు.

## జీడిమెట్లలో రోడ్డు, డ్రైనేజీ సమస్యలపై పర్యటన

**ముద్ర, హైదరాబాద్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 132 జీడిమెట్ల డివిజన్ (286 కుత్బుల్లాపూర్ డివిజన్)లో రోడ్డు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలియజేయడంతో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి గ్రామంలో పర్యటించారు. స్థానికులతో కలిసి వీధులలో తిరిగి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడితో పాటు ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దూకుడు పెంచిన బీజేపీ

**ముద్ర, తాండూర్:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న అసాధ్యమైన హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని 24వ వార్డ్ బీజేపీ మాజీ కౌన్సిలర్, ప్రస్తుత అభ్యర్థి సాహు శ్రీలత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్ల కాలంలో 24వ వార్డులో తాను నిస్వార్థంగా పనిచేశానని తెలిపారు. సీసీ రోడ్లు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరోసారి బీజేపీకి ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తాను నిరంతరం ప్రజాసేవకే అంకితమైన వ్యక్తినని తెలిపారు. ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని సాహు శ్రీలత కోరారు.



## మున్సిపాలిటీపై కాంగ్రెస్ పట్టు ఖాయం

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వికారాబాద్ మున్సిపాలిటీలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ ఇన్‌చార్జి రాములు ధీమా వ్యక్తం చేశారు. వికారాబాద్ పట్టణంలోని 26వ వార్డులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సారథ్యంలో వికారాబాద్‌కు అధిక నిధులు తీసుకువచ్చి, పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతామని అన్నారు. 26వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి టీ. మల్లేశ్‌కు మద్దతుగా కార్యకర్తలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అంపల్లి సర్పంచ్ అనంతయ్య, ధర్మపూర్ సర్పంచ్ అనిల్ కుమార్, కొండయ్య, గంగులు, కురుమ తదితరులు పాల్గొన్నారు.

## 'పేట'లో మున్సిపల్ పోరు హోరాహోరీ

- **పోలింగ్ సమీపించడంతో జోరందుకున్న ప్రచారం**

**ముద్ర, నారాయణపేట :**



నారాయణపేట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో అన్ని పార్టీల అభ్యర్థులు గడపగడపకు వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి పార్టీ ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ప్రచారాన్ని మరింత ఉధృతం చేసింది. పట్టణాభివృద్ధి బీజేపీ ద్వారానే సాధ్యమని చెబుతూ, బీజేపీ సీనియర్ నాయకుడు నాగురావు నామాజీ నేతృత్వంలో బీజేపీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వ హయాంలోనే పట్టణం అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. కాంగ్రెస్‌కు 20 సీట్లు ఇస్తే రూ. 200 కోట్లతో పట్టణ అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి హామీ ఇస్తూ తమ అభ్యర్థులతో కలిసి ప్రచారం కొనసాగించారు.

**వార్డులవారీగా ఉధృత ప్రచారం**

పట్టణంలోని 1వ వార్డులో బీజేపీ అభ్యర్థి సుతారి సత్య రఘుపాల్, 4వ వార్డులో కొండా శ్వేతా సత్య యాదవ్, 10వ వార్డులో సిద్ధి విశాలాక్షి వెంకట్ రాములు, 16వ వార్డులో కమలాపూర్ అంబికా శ్రీనివాస్, 21వ వార్డులో కమలాపూర్ ప్రభాకర్ ప్రచారాన్ని మరింత దూకుడుగా కొనసాగిస్తున్నారు. వందలాది మంది వార్డు ప్రజలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. 3వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి పోలేమోని పద్మ హస్తం గుర్తుకు ఓటు వేయాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. 11వ వార్డులో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి డాక్టర్ భాగ్యలక్ష్మి మల్లేష్ సింహం గుర్తుకు ఓటు వేయాలని ముమ్మరంగా ప్రచారం చేశారు.

## ఉద్యమ ఫలితంగా నారాయణపేట జిల్లా

- **ఆషామాషీగా రాలేదు : మాజీ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్**

**ముద్ర, నారాయణపేట :**



నారాయణపేట జిల్లా ఏర్పాటు ఆషామాషీగా జరగలేదని, ఉద్యమాల ద్వారానే సాధించుకున్న జిల్లా అని సేడం మాజీ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన హిందీలో మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో బీజేపీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాలకు సమర్థవంతమైన సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పట్టణంలో బీజేపీకి మంచి ఆదరణ ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, బీజేపీకి ఓటు వేసి కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చేతకాక ప్రజలు విసుగు పోయారని విమర్శించారు. బీజేపీ సీనియర్ నాయకుడు నాగురావు నామాజీ మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లా కొనసాగింపుపై సీఎం నుంచి స్పష్టత లేదని ఆరోపించారు. పట్టణంలో బీజేపీ జెండా ఎగిరితే ఆసుపత్రిని తిరిగి జిల్లా కేంద్రానికి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. బీజేపీకి అత్యధిక మెజార్టీ స్థానాలు ఇస్తే ఎంపీ డీకే అరుణ సహకారంతో మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో రతంగ పాండు రెడ్డి, లక్ష్మీ శ్యాంసుందర్, రఘువీర్, కిరణ్ దగే తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ముద్ర, వనపర్తి :**



మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఆదివారం వనపర్తి మున్సిపల్ కార్యాలయం, కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ విధానాన్ని పరిశీలించిన అనంతరం విధుల్లో ఉన్న అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఓటరుడి ప్రభుత్వ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన వారి వివరాలను ఓటరు జాబితాలో స్పష్టంగా మార్క్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్యతోపాటు ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

**ముద్ర, హైదరాబాద్ :**

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఫతేనగర్ డివిజన్‌లో వినయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా బండి రమేష్ స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాన్యులకు సైతం నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్నిరకాల వైద్య పరీక్షలను ఒకేచోట ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, కుక్కల రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మేకల రమేష్, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, మధురి రాము, రాజ్ పటేల్, మధు గౌడ్, అయాజ్, జ్యోతి తదితరులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మాధవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

**ముద్ర, హైదరాబాద్ :**

మాధవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు సభ్యులు తెలిపారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా ఎం. రామ్‌మోహన్ రావు, అధ్యక్షులుగా సిహెచ్.చిన్నారెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా హెచ్.రామారావు, ఏ. అనిల్, జనరల్ సెక్రటరీగా వై. రఘుకుమార్ ఎంపికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా వి.మల్లికార్జున్, పి.టి.వి.సత్యనారాయణ, ట్రెజరర్‌గా సిహెచ్.నవీన్ కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా ఎన్.వీర కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులుగా ఎ.హనుమంతరావు, కె.బాలాజీ, ఆర్.జయపాల్ రెడ్డి, జె.సత్యనారాయణ, ఆర్.శ్రవణ్ కుమార్, వి.రాంబాబు, ఎం.సురేష్ బాబు, డి.అజయ్ కుమార్, ఆర్.అంజి బాబు, వి.శివకుమార్, ఎస్.చిన్నపరెడ్డి, జి.కృష్ణార్జునరావు, సిహెచ్.భాస్కర్, పి.వంశీకృష్ణ, ఈ. ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు కాలనీ వాసులు అభినందనలు తెలిపారు.

## వైభవంగా గ్యారీ షరీఫ్ ఉత్సవాలు

**ముద్ర, కూకట్‌పల్లి :**

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని హస్మత్‌పేటలో శనివారం రాత్రి గ్యారీ షరీఫ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అల్లా కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గంగాజమునీ తెహజీబ్‌కు ప్రతీకగా నిలిచే ఇలాంటి ఉత్సవాలు మత సామరస్యాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నిర్వహించిన కమిటీ సభ్యులను బండి రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, దండుగుల యాదగిరి, మల్లికార్జున, అస్లాం, హమీద్, షహెన్షా, అశోక్‌తోపాటు కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ముస్లిం పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

సోమవారం 09-02-2026

www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు**

**అలీన్ బాబీ కేసు (హైదరాబాద్)**

అసెంబ్లీ సమీపంలో బాబీ అనే యువతి హత్యకు గురైన ఘటన అప్పట్లో రాజకీయంగా పెను దుమారం రేపింది. ఈ కేసులో ప్రముఖ రాజకీయ నాయకుల పేర్లు వినిపించడం ఉమ్మడి రాష్ట్రంలో చర్చనీయాంశమైంది.

# కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేయాలి..?

- ఒక్క హామీనైనా నెరవేర్చిందా? - మున్సిపాలిటీలకు ఐదు పైసలైనా ఇచ్చిందా?
- నిధులు ఇచ్చింది మోదీ... తెచ్చి అభివృద్ధి చేసింది మేం.. - బీఆర్ఎస్ కు ఓట్లేస్తే డ్రైనేజీలో వేసినట్లే...
- చొప్పదండి ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ముద్ర, కరీంనగర్:
కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు చొప్పదండి సహా మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులిచ్చింది కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వమైతే... ఆ నిధులు తీసుకొచ్చి తాము అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. అట్లాంటప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. ''రెండేళ్ల పాలనలో మున్సిపాలిటీలకు కాంగ్రెస్ ఒక్క రూపాయి ఇవ్వలేదు. 6 గ్యారంటీలను అమలు చేయలేదు. ఎన్నికలొస్తున్నాయని తెలిసి కూడా నిధులు విడుదల చేయలేదు. అట్లాంటప్పుడు కాంగ్రెస్ కు ఎందుకు ఓటేయాలి'' అని ప్రశ్నించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రజల జాగాలను కబ్జా చేసి అరాచకాలు చేసిన బీఆర్ఎస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చొప్పదండి పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మున్సిపాలిటీ ఎన్నికల ఇంఛార్జ్ సురభి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో చొప్పదండిసహా మున్సిపాలిటీల్లో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందంటే కేంద్ర నిధులతోనే అని అన్నారు. చొప్పదండికి అమ్రుత్ 2 ద్వారా రూ.36 కోట్ల 30 లక్షలు, 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.5 కోట్ల 57 లక్షలు స్వచ్ఛ భారత్ ద్వారా రూ.42 లక్షల 66 వేలు కేంద్రం ఇచ్చిందన్నారు. స్వనిధి ద్వారా 1611 మందికి రూ.2 కోట్ల 94 లక్షల లబ్ది పొందారని తెలిపారు. చొప్పదండిలో ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను అందించడంతోపాటు టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించినట్లు తెలిపారు. చొప్పదండి ఛైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని, ఇంటింటికీ మంచి నీళ్లు, కుడి చెరువు అభివృద్ధి, కొత్త రోడ్లను నిర్మిస్తానని తెలిపారు చొప్పదండి ఆసుపత్రిని కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపిస్తే అభివృద్ధి ఆగిపోతుందని, 5 ఏళ్ల నరక యాతన పడతారు.. తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.

# ఎవరి బెదిరింపులకు భయపడేది లేదు

- నాయకులు కార్యకర్తలు ప్రజలకు అండగా మేమున్నాం.. - చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు..
- జగన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి.. - జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
16వ డివిజన్ లో మంత్రితో కలిసి ప్రచారంలో పాల్గొన్న వెలిచాల రాజేందర్ రావు

ముద్ర, కరీంనగర్:
కరీంనగర్ 16వ డివిజన్ లో ఓడిపోతామనే భయంతో కొందరు పనికిమాలిన వాళ్ళు కార్పొరేటర్ అభ్యర్థి జగన్ రెడ్డి మనుషులను బెదిరిస్తున్నారని, ఆ బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అండగా తాము ఉంటామని భరోసా కల్పించారు.

ఆదివారం కరీంనగర్లోని 16వ డివిజన్ మల్కాపూర్ లక్ష్మీపూర్ లో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి కాంతాల జగన్ రెడ్డి కి మద్దతుగా జరిగిన కార్నర్ మీటింగ్ లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగన్ రెడ్డిని డివిజన్ ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రుణమాఫీ చేసి రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. రైతులకు అత్యధిక ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వం, మీ ఆపదలో అండగా ఉండే ప్రభుత్వం, ప్రజల క్షేమం కోరే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్పొరేషన్ ఎన్నికల్లో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని, రాజేందర్ రావు నేతృత్వంలో ప్రజలకు ఏ పని కావాలన్నా చేసి పెడతామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు.



అనంతరం అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ కంటి ముందు అభ్యర్థి, ఇంటి ముందు అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్న జగన్ రెడ్డిని డివిజన్ ప్రజలు గెలిపించాలని కోరారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్న ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి కాంతాల జగన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొమ్మ ఈశ్వర్ గౌడ్ కోటోజు శ్రీనివాసు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**వెలిచాల.. సంతోష్ కుమార్ జోడెడ్ల లాగా పని చేయాలి..**

కరీంనగర్ నగర పాలక సంస్థపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా అసెంబ్లీ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్రావు, మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్ జోడెద్దుల్లాగా పనిచేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కరీంనగర్లో ఆదివారం అసెంబ్లీ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు ఆహ్వానం మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో సంతోష్ కుమార్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సంతోష్ కుమార్ సత్కరించారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో తాజా రాజకీయ పరిస్థితులపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై మంత్రికి సంతోష్ కుమార్ పలు సూచనలు చేశారు. అన్నింటినీ సావధానంగా విన్న మంత్రి కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని పేర్కొన్నారు. సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని సంతోష్ కుమార్ కు మంత్రి సూచించారు. అన్ని డివిజన్లలో అభ్యర్థులు ఘన విజయం సాధించేలా నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

# భక్తులకు నాణ్యమైన భోజనం అందించాలి

ధర్మపురిలోని నిత్య అన్నదాన సత్యాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి అడ్లూరి



ముద్ర, ధర్మపురి:
ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు రుచికరమైన భోజనం అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దేవాలయ అధికారులను ఆదేశించారు. ఆదివారం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య అన్నదాన సత్రాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వంటగదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని, భక్తులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ఈ సందర్భంగా అన్నదాన సత్రంలో అందుతున్న భోజనం ఎలా ఉందని భక్తులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నిత్య అన్నదాన సత్రంలో మౌలిక వసతుల కల్పనకు తన వంతుగా నిధులు కేటాయిస్తానని తెలిపారు. అందుకు కావలసిన అంచనాలు తయారు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

**రెండేళ్ల అభివృద్ధిని వివరిస్తూ మంత్రి ఎన్నికల ప్రచారం..**

ధర్మపురి మున్సిపాలిటి పరిధిలో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి పట్టణంలో వాడ వాడలా తిరుగుతూ అభివృద్దిని వివరించారు. ఈ సందర్భంగా వార్డుల్లోని సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ధర్మపురి మున్సిపాలిటి పరిధిలోని 6వ వార్డు, 12వ వార్డు, 13వ వార్డుల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో విజయం సాధిస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురిలో బీజేపీ పార్టీ ఖాతా తెరవదని బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేయడానికి సైతం ప్రజలు సిద్దంగా లేరని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గడిచిన రెండు సంవత్సరాలుగా ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి ఓటర్లకు వివరించారు. రానున్న రోజుల్లో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు.



## మున్సిపల్ ఎన్నికలకు భారీగా పోలీస్ బందోబస్తు

- ఎస్పీ జానకి షర్మిల



ముద్ర ప్రతినిధి, నిర్మల్:
ఈ నెల 11న నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందో బస్తు ఏర్పాట్లు చేసిందని ఎస్పీ డా.జానకి షర్మిల తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఫలితాలు వెల్లడించే వరకు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా అంతటా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ఎలక్షన్ సెల్ ద్వారా నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలు, కీలక ప్రాంతాలు సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయని స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగుస్తుందని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి భయాలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎంఐఎం గెలిచిన ప్రాంతాల్లో గొడవలే..

- మాజీ ఎంపీ నవనీత్ కౌర్ రాణా



ముద్ర ప్రతినిధి, నిర్మల్:
ఎంఐఎం గెలిచిన ప్రతి చోటా గొడవలు, దాడులు సాధారణం అయ్యాయని, శాంతి భద్రతలు కావాలంటే బీజేపీకి ఓటు వేయాలని మహారాష్ట్ర బీజేపీ మాజీఎంపీ నవనీత్ కౌర్ రాణా అన్నారు. నిర్మల్ జిల్లా బాసర అమ్మవారిని ఆమె ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం భైంసాలో ఎంఎల్ఏ రామారావు పటేల్ ఇంట్లో కార్యకర్తలతో మాట్లాడారు. భైంసా మున్సిపాలిటీ ఇప్పటివరకు ఎంఐఎం చేతుల్లో ఉందని, ఈ సారి మాత్రం తిలకం ధరించే ప్రతి ఒక్కరు బీజేపీకి ఓటు వేసి మున్సిపాలిటీపై కాషాయం ఎగురవేసేలా చూడాలని కోరారు. దేశంలో ఎంఐఎం గెలిచిన చోట్లు అశాంతి నిలయాలుగా మారాయని, ప్రతి హిందువు ఓటింగ్ పెంచి బీజేపీ కి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## కాంగ్రెస్ ను వీడి బీజేపీ లోకి...



ముద్ర ప్రతినిధి, నిర్మల్:
ఎన్నికలు మూడు రోజులున్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు యువకులు బీజేపీ లో చేరారు. పట్టణంలోని 36వ వార్డు బుధవార్ పేట్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మౌర్య ప్రవీణ్, పడిగల మురళి, పడిగల ముకేష్, దర్శనం పరమేశ్ తో పాటు పలువురు యువకులు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెడిసెమ్మ రాజు, చరణ్ మౌర్య, రవి, కత్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి



23, 46, 14 డివిజన్లలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రచారం

ముద్ర, కరీంనగర్:
కరీంనగర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఓటర్లను కోరారు. ఆదివారం ఎమ్మెల్యే కరీంనగర్ లోని 23, 46, 14 డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నగరంలోని 23వ డివిజన్ లో డి మార్ట్ ఏరియాలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జంగిలి సాగర్ తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. డివిజన్లో అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో డివిజన్ ను అభివృద్ధి చేసిన జంగిలి సాగర్ కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలోని 46వ డివిజన్ లో గల రాంనగర్ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బోనాల శ్రీకాంత్ తో కలిసి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాకముందు రాంనగర్ ప్రాంతం ఒక కుగ్రామంగా ఉండేదని, తెలంగాణ వచ్చిన తర్వాత టీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సీఎం అస్యూరెన్స్ నిధులతో.. రాంనగర్ ను అన్ని విధాల అభివృద్ధి చేశామని తెలిపార. కారు గుర్తుపై ఓటేసి బోనాల శ్రీకాంత్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

14వ డివిజన్ పద్మనగర్లో కార్నర్ మీటింగ్లో అభ్యర్థి గడ్డి ప్రదీప్ తో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొని మాట్లాడారు. కారు గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఆయా డివిజన్లలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో పాటు జంగిలి సాగర్, బోనాల శ్రీకాంత్, గడ్డి ప్రదీప్ డివిజన్ వాసులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శివాలయంలో లడ్డూలతో మహాభిషేకం

ముద్ర, కరీంనగర్:
కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో ఆదివారం స్వామి వారికి లడ్డూలతో మహాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు సుబ్రమణ్యం శర్మ మంత్రాల మధ్య స్వామి వారికి ఈ కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రామిడి శ్రీనివాస్, ఉపసర్పంచ్ తాళ్లపెల్లి మహేశ్ గౌడ్, సభ్యులు మహాశివరాత్రి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీలలో వెయ్యేళ్ల చరిత్ర కలిగిన వీణవంక శివాలయంలో మహా శివ రాత్రి ఉత్సవాలను అత్యం త వైభవంగా నిర్వహించ డానికి ఆలయ కమిటీ ఆధ్వర్యం లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి దీవెనలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి, వనిత క్లబ్ సభ్యులు అల్లెంకి సాంబమూర్తి, రమేష్, నాగన్న, విశ్వంభర్, లక్ష్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు**

చంద్రబాబు నాయుడుపై అలిపిరి బాంబు దాడి (తిరుపతి): 2003లో తిరుమలకు వెళ్తున్న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై నక్సలైట్లు క్లైమోర్ మైన్స్‌తో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.



## నేటి నుంచి మద్యం దుకాణాల మూసివేత

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఈ నెల 9నుండి 11వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.విష్ణుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హనుమంతరావు ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో శాంతి భద్రతలను పరిరక్షించుటకు, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించుటకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో మద్యం దుకాణాల మూసివేతకు (డ్రై డేస్) సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. 13న ఎన్నికల ఫలితాల నాడు ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని మద్యం షాపులు, బార్‌లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపో పూర్తిగా మూసివేయబడునన్నారు. అతిక్రమించిన వారిపై చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మాటంటే మాటే..

- **పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి**

**ముద్ర, ఏదులాపురం:**



మాట ఇస్తే మాట తప్పే ప్రసక్తే లేదని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కందాళ మాట్లాడుతూ.. మున్నేరు పై ఇప్పుడు నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జ్ తన హయంలో మంజూరు చేసిందేనని, కొందరు తమ స్వార్ధంకోసం తామే తెచ్చామని చెప్పుకుంటున్నారని అన్నారు. ఎంత మంది విద్యార్థులను చదివిస్తున్నానో, ఎన్ని దేవాలయాలకు, చర్చిలకు, మసీదుల నిర్మాణానికి తన వంతు సాయం చేశానో సాయం పొందిన వారిని అడిగితే తెలుస్తుందని గుర్తు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సీపీఎం పార్టీ అభ్యర్థి మెడబోయిన నాగమణిని, 5 వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాణోత్ మోహన్, 25వ వార్డు సీపీఎం పార్టీ బలపరిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నాశబోయిన కనకయ్యకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు & ఎమ్మెల్సీ తాత మధుసూదన్, సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వర రావు,సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## సూదగాని సరిత రాజు గౌడ్ ను గెలిపించాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి పట్టణం 28వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సూదగానిగ సరిత రాజు గౌడ్ ను గెలిపించాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరారు. భువనగిరి పట్టణం మీనానగర్ కాలనీలోని కాంగ్రెస్ అభ్యర్థి ఇంటింటికి ప్రచారం నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కుంభం హాజరై మాట్లాడారు. మీనానగర్ కాలనీ అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సూదగాని సరిత రాజు గౌడ్ హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

## ప్రజా సమస్యలు తెలిసినవాడు యాదగిరి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**



నిరంతరం ఎర్రజెండా ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే ఊపిరిగా పనిచేస్తున్న పోచంపల్లి 4వ వార్డు సీపీఎం అభ్యర్థి వడ్డేపల్లి యాదగిరికి ఓటు వేసి గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. ఆదివారం పోచంపల్లి పట్టణంలోని 4వ వార్డు సిపిఎం అభ్యర్థి వడ్డేపల్లి యాదగిరిని గెలిపించాలని కోరుతూ ఇంటింటికి అభ్యర్థి వడ్డేపల్లి యాదగిరితో కలిసి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రజలపై భారం మోపుతూ ప్రజల బతుకులను ఆగమాగం చేసిందని అన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి చెప్పి అమలులో మాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఏమో పదేళ్ల పాలనలో ప్రజల సంక్షేమం, పట్టణాల అభివృద్ధిని మరిచి పాలన చేయడం వల్లనే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. సిపిఎం తరపున పోటీ చేస్తున్న వడ్డేపల్లి యాదగిరిని ప్రజలు ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కోట రామచంద్రారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, పట్టణ, మండల కమిటీ సభ్యులు బుగ్గ లక్ష్మయ్య, పొన్నమోని కృష్ణ, పత్తి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం పట్టణంలోని 28వ వార్డు అభ్యర్థి గుమ్మల సరిత మల్లేశం, 28వ వార్డు కొలుపుల హరిప్రియ కమలాకర్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



## రైతాంగానికి అండగా నిలిచింది బీఆర్ఎస్

**ముద్ర, వైరా:**

రైతుల పక్షాన నిలిచిన బీఆర్ఎస్ పార్టీకే మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రజలను కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి, 18వ వార్డు అభ్యర్థి రాచబంటి శ్రీదేవి, 19వ వార్డు దామ ఉమ, 17వ వార్డు రాచర్ల పద్మ, 10వ వార్డు కిన్నెర కృష్ణ, 11వ వార్డు దొంతెబోయిన వెంకటేశ్వర్లుల విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో తాగు, సాగునీరు, విద్యుత్ కష్టాలు లేకుండా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అంటేనే యూరియా కష్టాలు, రైతాంగానికి అవస్థలు అని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఆయన సూచనల మేరకు పార్లమెంట్‌లో కేంద్రంపై పోరాడి రాష్ట్ర రైతాంగానికి సరిపడా యూరియా నిల్వలు తీసుకువచ్చి అందుబాటులో ఉంచామన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను బాకీ కార్డుతో నిలదీయాలని అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి భూ బకాసురులు

- **ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో సీపీఐ నారాయణ తీవ్ర విమర్శలు**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**



ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సీపీఐ జాతీయ నాయకుడు కంకణాల నారాయణ వివిధ వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ కార్యకర్తలు బారి ర్యాలీ నిర్వహించారు. మహిళలు ఎర్ర చీరలు ధరించి ఎర్ర జెండాలు చేతబూని, డప్పు వాయిద్యాలతో, కోలాటాలతో ఏదులాపురం వీధుల్లో కథం తొక్కారు, వీధులన్నీ "ఎరుపు వర్ణాన్ని" సంతరించుకున్నాయి. ర్యాలీకి అనుకున్న దానికంటే ఎక్కువ స్పందన లభించిందని, ఈ ర్యాలీ విజయవంతం కావడం రేపటి గెలుపును సూచిస్తుందని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఐ నారాయణ మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ ఓట్లతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నేడు విస్మరించారని మండి పడ్డారు. కొత్తగూడెం, ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ పార్టీ పొత్తును కాంగ్రెస్ పార్టీ ఎందుకు తిరస్కరించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని అన్నారు. కొత్తగూడెం, ఏదులాపురం మున్సిపాలిటీల్లో సీపీఐ పార్టీ గెలుపొందితే సీఎం రేవంత్ రెడ్డి పదవి ఏమైనా ఊడిపోతుందా లేక పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంత్రి పదవి ఏమైనా పోతుందా అని ప్రశ్నించారు? కమ్యూనిస్టు పార్టీలు గెలిచేనంత మాత్రానా మీ పదవులకు వచ్చిన ఇబ్బంది ఏమి లేదుగా ?ఎందుకు రాజకీయ కక్కుర్తి ? అన్నీ మాకే కావాలనే రాజకీయ దురుద్దేశం, కక్కుర్తితో మంత్రి పొంగులేటి ప్రవర్తిస్తున్నాడని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి ఎదులాపురంలో గానీ కొత్తగూడెంలో గానీ పేద వాళ్ళకు ఒక్క సెంటు భూమి గానీ, ఒక్క ఇల్లు గానీ ఇచ్చిన జాడ ఉందా అంటూ మంత్రి పొంగులేటిని ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారత కమ్యూనిస్ట్ పార్టీ భూ పోరాటాలు చేసి వందల ఎకరాలు పేదలకు పంచిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. మీకు ఏ చరిత్ర ఉంది అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ వాళ్ల దగ్గర డబ్బులు బాగా ఉన్నాయి.., తీసుకొని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయండని చెప్పినట్లు తాను డబ్బులు తీసుకుని ఓట్లు వేయమని చెప్పడం లేదని గుర్తు చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్రజా సమస్యల మీద కొట్లాడే భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పేదల భూములు బలవంతంగా గుంజుకోవడంలో కాంగ్రెస్ బీఆర్ఎస్ దొందు దొందే అని, నిండు అసెంబ్లీలో రెండు పార్టీలు బూతులు తిట్టుకోవడం తప్ప రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీలేదని అన్నారు. అసెంబ్లీలో కాకుల్లో కోకిల లాగా కూనంనేని సాంబశివరావు ఒక్కడే సీపీఐ ఎమ్మెల్యేగా స్థానిక ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కొట్లాడుతున్నాడని వ్యాఖ్యానించారు.

## ఘనంగా గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం

**ముద్ర, నడిగూడెం:**



మండల కేంద్రంలో గల శ్రీ కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974-75 విద్య సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. గురువులైన విరామ ప్రధానోపాధ్యాయులు పసుపులేటి బిక్షమయ్య, విరామ డ్రిల్ మాస్టర్ హబీబుద్దీన్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.., ఈ పాఠశాలలో పొందిన విద్య,క్రమశిక్షణ తమ జీవితాల్లో ఎంతో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. సమ్మేళనంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, అనుభవాల పంచుకోవడం, జ్ఞాపికల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండి అఫ్జల్, చిల్లంచర్ల సత్యనారాయణ, పున్నం గోపాలరావు, కె వి ఎస్ ఎన్ గుప్తా, శ్రీ ఆంజనేయులు,నూనె వెంకన్న, కొల్లు వెంకటేశ్వరరావు, రఘు నాగేశ్వరరావు, కారంశెట్టి సత్యనారాయణ, షరీఫ్, దుర్గ దత్త, ధనలక్ష్మి, విద్యాసాగర్, లక్ష్మీనారాయణ రెడ్డి, దుర్గారావు, లింగయ్య, విజయ కుమారి, రామ్ రెడ్డి,అనసూర్య, వీర కుమారి, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేశారు.



## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

- **భువనగిరిలో మంత్రి సీతక్క ప్రచారం**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, భువనగిరి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక హైదరాబాద్ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలి అన్నారు.

## శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులు పొందాలి

- **భక్తి శ్రద్ధలతో భోగ్ బండారో కార్యక్రమాన్ని ప్రారంభించిన బంజారా నాయకులు**

**ముద్ర, ఖమ్మం:**



"సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని పురస్కరించుకుని రఘునాథపాలెం కమిటీ ఆధ్వర్యంలో భోగ్ బండారో కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రఘునాథపాలెం రైతు వేదిక పక్కన ఉన్న భవాని ఘడ్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి,లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజకుమార్ నాయక్, టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరు నాయక్, టీజీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, బంజార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ మాట్లాడారు. ప్రతీ సంవత్సరం లాగే జాతి పవిత్రతను చాటి చెప్పేలా ఫిబ్రవరి 15వ తేదీకి వారం రోజుల ముందు నుండి శ్రీ సేవాలాల్ మహారాజ్ స్మరణ చేస్తూ జయంత్యుత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లా నుండి మొదలవుతున్న ఈ ఉత్సవాలకు అందరూ కలిసి వచ్చి, భగవంతుని ఆశీస్సులు పొందాలని విన్నవించారు. ఈ మహా భోగ్ భండారో పవిత్రతను పాటించే జాతి సాధువులు, సంతులు, భావోజీలు, భగత్ ల చేతితో మొట్టమొదటి ప్రారంభం చేయడం మంచి శుభసుచికం అన్నారు. రాజకీయాలకు అతీతంగా జాతి ఐక్యతను కాపాడడం అందరి బాధ్యత అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భూక్యా రాంబాబు నాయక్ అధ్యక్షత వహించగా, మాజీ జడ్పీటీసీ అజ్మీరా వీరు నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దీప్లా నాయక్, మాజీ కార్పొరేటర్ ధరావత్ రామ్మూర్తి నాయక్, బిక్షపతి రాథోడ్, మండల కన్వీనర్ మళోత్ రాము నాయక్, బానోతు ప్రమీల బాయి, డీఈ రాందాస్ నాయక్, వెంకటరాం నాయక్, బీజేపీ ప్రధాన కార్యదర్శి రవి రాథోడ్, మండల కార్యదర్శి భూక్యా బాలాజీ నాయక్ నంద్య నాయక్, జగ్యా నాయక్, మాంగ్య నాయక్, టీజీబీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు భూక్యా శోభన్ నాయక్, రామారావు నాయక్, ఎల్ హెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు దశరథ్ నాయక్, ఆంగోత్ శివలాల్, గ్రామ సర్పంచులు, ఉద్యోగ సంఘాల నేతలు, లంబాడి ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాలన మరిచి కాలక్షేపం చేస్తున్నారు..

**ముద్ర, కొత్తగూడెం:**

కాంగ్రెస్ పాలకులు ఈ రెండేళ్లలో చేసిందేమీ లేదని, పాలనను పక్కన పెట్టి కాలక్షేపం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ మేదరబస్తీలో అభ్యర్థి ధరావత్ అనితను భారీ ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరుతూ, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మితో కలిసి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దిల్ సింగ్, లక్కినేని సురేందర్, హరిసింగ్ నాయక్, బొమ్మిడి రమాకాంత్ యాదవ్, మామిడి శ్రీనివాస్, దూడల బుచ్చయ్య, నవతన్, దూడల కిరణ్, లఖన్, మోతి, పాషా, శివ తదితరులు పాల్గొన్నారు.






## వెంకటేశంను భారీ మెజారిటీతో గెలిపించాలి

- **మాజీ ఎమ్మెల్యే పైళ్ల**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపాలిటీ ఎన్నికల్లో 22వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మంద వెంకటేశం కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఓటర్ల ను కోరారు. వార్డులో ఆయన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కావాలంటే వెంకటేశంను గెలిపించాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
09.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు**

పరిటాల రవి హత్య (అనంతపురం): 2005లో అనంతపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయం బయట ఫ్యాక్షనిస్ట్ నేత పరిటాల రవీంద్రను ప్రత్యర్థులు కాల్చి చంపారు. ఈ హత్య రాయలసీమలో తీవ్ర హింసాత్మక ఘటనలకు దారితీసింది.



## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**ముద్ర, హైదరాబాద్:**

మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలోని పోచమ్మ అమ్మవారికి మాల సంఘం సభ్యులు ఆదివారం బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా పోచమ్మ అమ్మవారికి దూప దీప నైవేద్యాలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఇలా చేయడం వల్ల పాడిపంటలు, గ్రామస్తులు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. గ్రామ ప్రధాన వీధుల నుంచి అమ్మవారికి సమర్పించేందుకు మహిళలు తీసుకొస్తున్న బోనాల ఊరేగింపు కార్యక్రమం అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు టంకరి ప్రశాంత్, బండారి ఎల్లం, మాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్‌తో విసుగెత్తిన జనం

- **మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో జనం విసుగెత్తారని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మెదక్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 18, 17, 16,19 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు టేకు శంకర్, బట్టి లలిత జగపతి, అవారి రాజశేఖర్, గొల్ల బోయిన సునీల్ లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ రావాలని జనం కోరుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఉన్నప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని, బీఆర్ఎస్‌ను ఓడించి తప్పు చేశామని జనం భావిస్తున్నారని చెప్పారు. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని ఆరోపించారు. మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, ఆసరా పింఛన్లు రూ.4వేలు, రైతు భరోసా రూ.15వేలు, కేసీఆర్ కిట్టు, విద్యార్థినులకు స్కూటీలు ఎగ్గొట్టారని తెలపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తూ మిమ్మల్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మెదక్ మున్సిపాలిటీని అభివృద్ధి చేశానని వివరించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును గ్రహించి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రహించే ప్రజలపై వత్తిడి తెస్తూ బెదిరిస్తున్నారన్నాని విమర్శించారు. ఈ ప్రచారంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, వార్డ్ ఇంచార్జులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- **కార్మిక సంఘాల నాయకుల పిలుపు**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

దేశ వ్యాప్తంగా ఈ నెల 12న జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి పాముని గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణపురం లక్ష్మణ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈదారి మల్లేశం కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వర్గ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల, ఉద్యోగ సంఘాలు, ఫెడరేషన్లు, స్వతంత్ర ఫెడరేషన్లు, ఐక్య కార్యచరణగా ఏర్పడినట్లు తెలిపారు. ఈ నెల 12న దేశ వ్యాప్తంగా 42 కోట్ల మంది కార్మికులు సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందుకు తగ్గట్లుగా దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, స్కీం, పర్మనెంట్ వర్కర్లు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ, మధ్యాహ్న భోజనం, బీడీ, ఆటో, గ్రామపంచాయతీ, మున్సిపల్ తదితర కార్మికులు సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సమ్మె నోటీసులు అందజేశామని తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని షాపింగ్ మాళ్లు, హాస్పిటల్ లో పనిచేస్తున్న కార్మికులు కూడా ఈ సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తెలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్, బీఆర్ టీయూ జిల్లా నాయకులు గుండె సంజీవులు తదితరులు పాల్గొన్నారు.



## అధికార పార్టీ అభ్యర్థులను గెలిస్తేనే అభివృద్ధి

- **ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

అధికార పార్టీ అభ్యర్థులను గెలిస్తేనే వార్డు, ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని 6వ వార్డు అభ్యర్థి కే. హరితకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో లేని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే మురుగు కాలువలలో వేసినట్టు అవుతుందని తెలిపారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే మెదక్ మున్సిపాలిటీ బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కష్టాలలో ఆదుకుంది ఇందిరమ్మ రాజ్యం అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ తిరిగిన గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు కనిపిస్తాయని చెప్పారు. పది సంవత్సరాలు మోసపూరిత మాటలు చెప్పారని బీఆర్ఎస్పై ధ్వజమెత్తారు. పదేళ్లల్లో ఒక్కరికి కూడా డబల్ బెడ్ రూం రాలేవని విమర్శించారు. దళిత బంధు, బీసీ బందు అని మాయ మాటలు చెప్పి మోసం చేశారని ఆరోపించారు. ఇంటింటికి ఉద్యోగం ఇస్తామని అమలు చేయలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం అందజేస్తున్నామని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. కరెంటును కూడా ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. ఇవన్నీ ఇలాగే కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు సుభాష్ చంద్రబోస్, రాగి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఏడుపాయల జాతరలో భక్తులకు సౌకర్యాలు

- **ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఏడుపాయల జాతరలో సామాన్య భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా వివిధ శాఖల ద్వారా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం ఏడుపాయల జాతర ఏర్పాట్లు, పనుల ప్రగతిని, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, తాగునీటి సౌకర్యార్థం, ఇంట్రా గ్రిడ్ సంపు, భక్తుల స్నానాలు ఆచరించే దగ్గర, బార్కేడింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సమయం దగ్గర పడుతున్నందున పనుల్లో వేగం పెంచి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయలలో జరిగే అతి పెద్దజాతరకు లక్షలాది మంది భక్తులు తరలి రానున్నందున అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచంచారు. జాతరలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి చెత్తా చెదారం తరలించేందుకు గ్రామ పంచాయతీ వాహనాలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, అధికారులు వేణు, నాగభూషణం, సంపత్ కుమార్, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

**ఫెసిలిటేషన్ సెంటర్ సందర్శణ..**

ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. ఎంత మంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ లో ఏర్పాట్లను, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఆదివారం సాయంత్రం ముగియగా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య కౌంటింగ్ హాల్ కు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**ప్రజావాణి రద్దు..**

మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు కలెక్టర్ కార్యాలయంతో పాటు నాలుగు మున్సిపాలిటీ ఏరియాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని తాత్కాలిక వాయిదా వేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి యంత్రాంగానికి సహకరించాలని ఆయన కరారు.





## కుటీర పరిశ్రమల ఏర్పాటు చేస్తాం

- **మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

జోగిపేట పరిసర ప్రాంతంలో స్థానిక మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషిచేస్తానని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఆదివారం ఆయన అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా 1,4,5,6,7,8,9వ వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. జోగిపేట అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందోల్ శివారులో నాలుగు వందల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో మహిళలను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 గ్యాస్ సబ్సిడీ, వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. జోగిపేటలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేసి, ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. జోగిపేటను ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అన్ని వార్డుల్లో భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. మంత్రి వెంట మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, నాయకులు ఎస్. కృష్ణారెడ్డి,

డాకూరి వెంకటేశం, ప్రదీప్ గౌడ్, హరిక్రిష్ణాగౌడ్, తొట్ల రామక్రిష్ణ, బండల సంతోష్, కోటాల శ్రీను, తుపాకుల సునీల్, డాకూరి శివశంకర్, సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో దారుణం

- **చెత్తకుప్పలో పసికందు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లా చిలిప్‌చెడ్ మండలం బద్రియ తండాలో దారుణం చోటు చేసుకుంది. అప్పుడే పుట్టిన పసికందును తల్లి చెత్త కుప్పపై పడేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పసికందును అంగన్ వాడీ టీచర్ మాలోత్ అనిత ద్వారా మెదక్ మాత శిశు సంరక్షణ కేంద్రానికి చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తరలించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం బాగుందని పరీక్షించిన పిల్లల వైద్యులు డా.చంద్ర శేఖర్ తెలిపారు.



## మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

- **మాజీ మంత్రి హరీష్ రావు**

**ముద్ర, హైదరాబాద్:**

సంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధిని, సంక్షేమాన్ని విస్మరించిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మున్సిపాలిటీలో హరీష్ రావు పర్యటించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కోహిర్ అభివృద్ధి చెందాలంటే కారు గుర్తు గెలవాలన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం కేసీఆర్ ఎంతో చేశారన్నారు. జహీరాబాద్, కోహిర్ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టి నాణ్యమైన విద్యను అందించామని గుర్తు చేశారు. అందుకే జహీరాబాద్ తాలూకా నుంచి 50 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించి డాక్టర్లు అయ్యారు. ఇది కేసీఆర్ విజయం కాదా.. అన్నారు. ఇమామ్ లకు, మౌజంలకు నెలనెలా గౌరవ వేతనం ఇచ్చి ఆదుకున్నది కేసీఆర్ అని స్పష్టం చేశారు.

ఇంటి బిల్లులు ఆపుతామని బెదిరిస్తే.. ఇక్కడే కుర్చీ వేసుకొని శాంక్షన్ చేయించే బాధ్యత తనది. నిధులు ఎవరి జాగీర్ కాదు.. ఫైనాన్స్ కమిషన్ నుంచి నేరుగా మున్సిపాలిటీలకు వస్తాయన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చాం. ఇప్పుడు రేవంత్ రెడ్డి 12 గంటలే ఇస్తున్నాడు. రైతులను మళ్ళీ యూరియా బస్తాల కోసం క్యూ లైన్లలో నిలబెట్టిన ఘనత రేవంత్ రెడ్డిది అని మండిపడ్డారు. .



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు**

మహబూబ్‌నగర్ బస్సు ప్రమాదం (పాలెం): 2013లో వోల్వో బస్సు కల్వర్టును ఢీకొనడంతో మంటలు చెలరేగి 45 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఇది మానవ తప్పిదం మరియు భద్రతా లోపాల వల్ల జరిగిన అతిపెద్ద విషాదం.



# బీజేపీని ఓడించేందుకు ఎంఐఎంతో రూ.100 కోట్ల డీల్

- నిన్న కాంగ్రెస్, ఎంఐఎం రహస్య సమావేశం పెట్టుకుంది
- బీజేపీ 50 సీట్లలో గెలవబోతోందని తెలిసి రూ.100 కోట్లతో ఓట్లను కొనేందుకు సిద్ధమయ్యారు
- పెద్ద ఎత్తున ఓట్లను కొని గెలవాలని కుట్ర చేస్తున్నయ్
- కాంగ్రెస్, ఎంఐఎం వర్సెస్ బీజేపీ మధ్య ఆట స్టార్ట్ అయ్యింది
- కరీంనగర్ లో 'విజయ సంకల్ప ర్యాలీ"లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- 50 వేల మందితో కాషాయ కార్యకర్తలతో కదం తొక్కిన 'విజయ సంకల్ప ర్యాలీ"
- జన సంద్రమైన కరీంనగర్

**ముద్ర, కరీంనగర్:**



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన "విజయ సంకల్ప ర్యాలీ" నగర వీధుల్లో కాషాయ జెండాల సంద్రంగా మారింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ అభివృద్ధిని అడ్డుకునేందుకు కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు అపవిత్ర పొత్తు పెట్టుకున్నాయని ఆరోపించారు.

**కాంగ్రెస్ - ఎంఐఎం మధ్య రూ. 100 కోట్ల డీల్?**

బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు రూ. 100 కోట్లతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. "కరీంనగర్‌లో బీజేపీ 50 సీట్లు గెలుస్తుందని సర్వేలు చెబుతుండటంతో ప్రతిపక్షాలకు వణుకు మొదలైంది. అందుకే ఓట్లను కొనుగోలు చేసేందుకు ఈ రహస్య ఒప్పందం చేసుకున్నాయి" అని ఆయన మండిపడ్డారు.

**కబడ్డీ ఆట మొదలైంది**

కరీంనగర్ ఎన్నికలను ఇండియా వర్సెస్ పాకిస్థాన్ కబడ్డీ ఆటతో పోల్చిన సంజయ్, బీజేపీ దేశం కోసం ఆడుతుంటే, కాంగ్రెస్‌ఎంఐఎం కూటమి దేశ వ్యతిరేక శక్తుల పక్షాన నిలుస్తోందని విమర్శించారు.రామాయణంలో రాముడికి రావణుడు గుర్తున్నట్లు.. మహాభారతంలో పాండవులకు కౌరవులు గుర్తున్నట్లు.. తనకు ఎప్పుడూ ఎంఐఎం నేత ఓవైసీయే గుర్తుకొస్తారని, అధర్మాన్ని అంతం చేసే వరకు విశ్రమించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

**ప్రజలకు పిలుపు: "రక్షణ కవచంగా ఉంటా"**

నగర ప్రజలు రెండు రోజుల పాటు బీజేపీ కోసం సమయం కేటాయించాలని, కులమతాలకు అతీతంగా ఏకమై కాషాయ జెండాను ఎగురవేయాలని ఆయన కోరారు. "కరీంనగర్ టవర్ సర్కిల్ పై మజ్లిస్ జెండా ఉండాలో.. కాషాయ జెండా ఉండాలో ప్రజలే తేల్చుకోవాలి. బీజేపీకి మేయర్ పీఠం అప్పగిస్తే, కేంద్రం నుండి నిధులు తెచ్చి నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాను" అని హామీ ఇచ్చారు.

ఈ ర్యాలీలో మహారాష్ట్ర మంత్రి ఆశీష్ షెల్లార్, మాజీ ఎంపీ నవనీత్ కౌర్ పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. వేలాదిగా తరలి వచ్చిన మహిళలు, యువతతో కరీంనగర్ వీధులన్నీ "జై మోదీ  జై బండి సంజయ్" నినాదాలతో మారుమోగాయి.ఈ నెల 11న జరగబోయే పోలింగ్‌లో బీజేపీ అఖండ విజయం సాధించడం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేశారు.



# ఆపరేషన్ సింధూర్ ఎఫెక్ట్..

- పాక్ రిపేర్లు

**ముద్ర న్యూస్:**

ఆపరేషన్ సింధూర్ వేళ తమకు ఏమీ కాలేదని పాక్ చెబుతున్నా.. ఉపగ్రహ చిత్రాల్లో మాత్రం పరిస్థితిని దాచలేకపోతోంది. భారత్ దాడిలో దెబ్బతిన్న భొలారిలోని పాక్ వాయుసేన స్థావరంలోని హ్యాంగర్‌కు తాజాగా మరమ్మతులు చేస్తోంది. మే 10 న భారత్ దీనిపై దాడి చేసింది. ఇక్కడ పాక్‌కు చెందిన ఎయిర్‌బార్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్ సాబ్2000 విమానం ధ్వంసమైనట్లు భారత్ అంచనా వేసింది. ఈ ఏడాది జనవరి 28న వాంటోర్ సంస్థకు చెందిన ఉపగ్రహాలు ఇక్కడ చిత్రాలను తీశాయి. ఆ సమయంలో ఎయిర్ బేస్‌లో దెబ్బతిన్న హ్యాంగర్‌కు పాక్ దళాలు మరమ్మతులు చేస్తున్నట్లు తేలింది. అప్పటికే దెబ్బతిన్న ఆకుపచ్చటి పైకప్పును తొలగించినట్లు కనిపించింది. మే 10 న పాక్ డ్రోన్ దాడులకు జవాబుగా వాయుసేన భొలారీ బేస్‌ను టార్గెట్ చేసుకొంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12లోపు దీనిలో హ్యాంగర్‌ను ధ్వంసం చేసింది. అయితే ఈ దాడికి వాయుసేన ఏ ఆయుధం వాడిందో మాత్రం వెల్లడించలేదు. ఇప్పటికే ఆపరేషన్ సింధూర్‌లో భారత్ దాడి చేసి ధ్వంసం చేసిన మిలిటరీ బేస్‌లలో మరమ్మతులు జరుగుతున్నట్లు కథనాలు వెలువడ్డాయి.

# ప్రతీ ఒక్కరికీ నా జీవితం గుణపాఠం

- ప్రేమ పెళ్లి చేసుకుని తప్పచేశా..
- ఇద్దరు పిల్లలకు ఉరేసి తల్లి సూసైడ్
- ఆత్మహత్యకు ముందు తల్లిదండ్రులకు లేఖ

**ముద్ర న్యూస్:**



తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణం కృష్ణానగర్ 3వ వీధిలో శనివారం రాత్రి ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్య చేసుకుంది. డీఎస్పీ జి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కృష్ణానగర్‌లో నివసిస్తున్న శివశంకర్, పద్మజ (27) ఒకే కాలేజీలో డిగ్రీ చదువుతూ ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరు కావడం, శివశంకర్ పని లేక జులాయిగా తిరుగుతున్నాడని పద్మ తల్లి దండ్రులు అంగీకరించలేదు. దీంతో పెద్దలను ఎదిరించి 2019లో పెళ్లి చేసుకున్నారు. వీరికి తేజశ్రీ (7), లాస్య (4) ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో తేజశ్రీ రెండో తరగతి, లాస్య యూకేజీ చదువుతోంది. శివశంకర్ నిరుద్యోగి కావడంతో శనివారం ఉదయం శ్రీసిటీ లో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లాడు.మధ్యాహ్నం 2.30 గంటలకు పిల్లలను తీసుకెళ్లాలని పాఠశాల నుంచి శివశంకర్‌కు ఫోన్ రావడంతో తాను ఇంటర్వ్యూలో ఉన్నానని చెప్పాడు. తెలిపిన వారిని పిల్లలను తీసుకెళ్లాలని చెప్పాడు. మార్గమధ్యంలో పద్మజ ఎదురెళ్లి పిల్లలను తీసుకెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న శివశంకర్ ఇంటి తలుపులు కొట్టినా ఎంతకూ తీయలేదు. దీంతో అనుమానం వచ్చి కిటికిలోనుంచి చూడగా ఉరి కొయ్యకు ముగ్గురూ వేళాడుతూ కనిపించారు. వెంటనే తలుపు పగలగొట్టి లోపలకు వెళ్లగా తల్లీ కుమార్తెలు విగత జీవులుగా కనిపించారు. సమాచా రం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.సంఘటన స్థలంలో దొరికిన సూసైడ్ లేఖ ద్వారా.. శివశంకర్ జులాయని, ఏ పని చేయకుండా అప్పులు చేస్తున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం శివశంకర్‌ను పెద్ద మనుషులు మందలించారని స్థానికులు సైతం తెలిపారు. శనివారం డ్వాక్రా లోన్ డబ్బు కట్టావా అని భర్తను ప్రశ్నించగా.. అతడు లేదని చెప్పాడు. దీంతో మనస్తాపం చెంది సూసైడ్ లేఖ రాసి, బెడ్ రూమ్‌లో ఇద్దరు పిల్లలకు ఉరేసి చంపింది. అనంతర హాల్‌లో తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ముందు తల్లిదండ్రులకు లేఖ రాసింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు శివశంకర్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రవి కుమార్ తెలిపారు.



## సమ్మక్క–సారక్క జాతర హూండీల లెక్కింపు

**నాలుగు రోజుల్లో రూ.10.71 కోట్ల ఆదాయం**

**ముద్ర, హైదరాబాద్:**

సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హూండీల లెక్కింపు నాలుగో రోజు ఆదివారం కూడా హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో కొనసాగింది. దేవాదాయ శాఖ అధికారులు, సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు.జాతరకు సంబంధించి మొత్తం 828 హూండీలు ఏర్పాటు చేశారు. అందులో 780 ఇనుప, 45 వస్త్ర, 3 బియ్యం హూండీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం 200 హూండీలను తెరిచి లెక్కించగా, వాటి ద్వారా రూ.2,64,75,757ల ఆదాయం లభించినట్లు వెల్లడించారు.

**ఇంతకుముందు**

- ఈ నెల 5న 125 హూండీల లెక్కింపులో రూ.2,49,65,000.
- ఈ నెల 6న 160 హూండీల లెక్కింపులో *రూ.3,54,25,200 తో పాటు విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.63,436.
- ఈ నెల 7న 140 హూండీల లెక్కింపులో •రూ.2,01,21,440 తో పాటు విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.71,283ల ఆదాయం లభించింది.

నాలుగు రోజుల వ్యవధిలో మొత్తం 625 హూం డీలను లెక్కించగా, రూ.10,71,22,116ల ఆదాయం సమకూరినట్లు అధికారులు స్పష్టం చేశారు. నాలుగో రోజు లెక్కించిన నగదులో నుంచి రూ.2,64,75,757 మొత్తాన్ని పర్యవేక్షణాధికారుల సమక్షంలో బ్యాంకు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. బంగారం, వెండి కానుకలను వేర్వేరుగా ఇనుప హూండీల్లో భద్రపరచి తాళాలు వేసినట్లు పేర్కొన్నారు. నాణేల లెక్కింపు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని వెల్లడించారు.

# అమెరికా కొత్త మ్యాప్.. పాక్‌కు బిగ్ షాక్

**ముద్ర న్యూస్:**

భారత్, అమెరికాల మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం జరిగింది. చిన్న విషయాలపై అంగీకారం మాత్రమే ఇప్పటికి ఉంది. భారత ఆర్థిక ప్రయోజనాలకు ఎటువంటి భంగం లేకుండా రూపొందింది. విపక్షాలు దీన్ని రాజకీయంగా విమర్శిస్తున్నప్పటికీ, ట్రంప్ హడావుడి చేసి ఒప్పించినట్లు కనిపిస్తోంది. భారత్ 'ట్రంప్ పోయాక చేసుకుంటాము' అని సూచించడంతో అత్యంత తొందరలో డీల్ ముగిసింది.

**భారత కొత్త మ్యాప్ రూపొందించిన అమెరికా సంస్థలు..**

ఒప్పందం జరిగిన కొన్ని గంటల్లోనే అమెరికా వాణిజ్య సంస్థలు సోషల్ మీడియాలో కొత్త మ్యాప్ విడుదల చేశాయి. ఇది ఇండియా మ్యాప్.. ఇందులో పూర్తి జమ్మూ కశ్మీర్ పాక్ ఆక్రమిత మీర్‌పూర్, ముజఫ్ఫరాబాద్, బల్తిస్తాన్, ఆజాద్ కశ్మీర్ భాగాలు భారత్‌లోనే భాగంగా చూపించారు. ఇది 1947లో రాజా హరి సింగ్ సంతకం చేసిన అధికారిక మ్యాప్ ఆధారంగా ఉంది. అమెరికా ప్రభుత్వ అనుమతితోనే ఇది వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో పీవోకే, చైనా ఆక్రమిత ప్రాంతాలను వేరుగా చూపేవారు. ఇప్పుడు పూర్తి కశ్మీర్ భారత్‌దిగా గుర్తించారు.

**దౌత్య విజయం..**

అమెరికా సెనేటర్లు, కాంగ్రెస్ సభ్యులు పీవోకే పర్యటించి భారత దృక్పథాన్ని అర్థం చేసుకున్నారు. ట్రంప్ 'ఇండో-పాక్' అనడం మొదలుపెట్టారు. ఇది భారత్ సాధించిన అతి పెద్ద దౌత్య విజయం. పాక్ ప్రపంచ జోక్యాన్ని కోరుకున్నప్పటికీ, మ్యాప్ మార్పు దానికి ఘాటైన దెబ్బ. ఆసిమ్ మునీర్ వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో విందు చేసినా, మోదీని పిలిచినా రాకపోవడం పాక్ ఆశలు ఆవిరయ్యాయి.

**షాక్‌లో పాక్.. భారత్‌లో ఆనందం..**

పాక్ 'కశ్మీర్ మాకు కావాలి, ప్రపంచం జోక్యం చేసుకో' అని ప్రతిజ్ఞ చేసినా, అమెరికా మ్యాప్ దాన్ని ధ్రువీకరించింది: కశ్మీర్ భారత్‌దే. గతంలో భారత-పాక్ వివాదంలో మధ్యవర్తిత్వం చెప్పిన అమెరికా, ఇప్పుడు చర్చలు లేకుండా భారత మ్యాప్‌ను అంగీకరించింది. వాణిజ్య ఒప్పందం ద్వారా ట్రంప్ ఒత్తిడి పెంచి ఈ మార్పు తెచ్చాడు. ఇది పాక్ పన్నాగాలకు చెక్ వేసి, భారత దృక్పథాన్ని అంతర్జాతీయంగా బలపరిచింది.




# భారత్ మలేషియా నవశకం..

- భారత్ - మలేషియా నవశకం..
- కీలక రంగాలపై ఇరు ప్రధానుల ఒప్పందాలు

**ముద్ర న్యూస్:**



ప్రధానమంత్రి నరేంద్రమోదీ మలేషియాలో రెండో రోజు పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మలేషియా ప్రధాని ఇబ్రహీంతో చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ అంశాలపై ఇద్దరి మధ్య చర్చలు జరిగాయి. పలు కీలక రంగాల్లో ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగించారు. భారత్‌మలేషియా మధ్య సంబంధాలు ప్రత్యేకమైనవని వ్యాఖ్యానించారు.

**టూరిజంలో పరస్పర సహకారం..**

డిజిటల్, బయోటెక్, ఐటీలో పరస్పర పెట్టుబడులు పెరిగాయని వివరించారు. టూరిజంలో పరస్పర సహకారం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఏఐ, డిజిటల్ టెక్నాలజీల్లో పరస్పర సహకారంపై ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. సెమీకండక్టర్లు, ఆరోగ్యం, ఆహార భద్రత రంగాల్లో ఒప్పందాలు జరిగాయని వివరించారు. ఉగ్రవాద నిర్మూలనకు రెండు దేశాలు కలిసి సంయుక్తంగా పనిచేస్తాయని ప్రకటించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో అభివృద్ధి, శాంతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ప్రపంచ వృద్ధి, వాణిజ్యానికి ఇండోపసిఫిక్ ప్రాంతం కీలకమని చెప్పుకొచ్చారు.

**ఉగ్రవాదంపై రాజీ పడే ప్రసక్తే లేదు..**

ఈ వేదికగా ఉగ్రవాదం మీద పోరుపై భారత్ వైఖరిని మరోసారి ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం మీద పోరుపై భారతదేశ సందేశం స్పష్టంగా ఉందని తెలిపారు. ద్వంద్వ ప్రమాణాలు లేవని, రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పారు. శాంతి కోసం చేసే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అరికట్టడం, నిఘా భాగస్వామ్యం, సముద్ర భద్రతలో భారత్  మలేషియా మధ్య సహకారాన్ని బలోపేతం చేస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు నిర్వహణకు నోడల్ అధికారులు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లింగ్యానాయక్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11న జరుగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం క్లస్టర్ల వారీగా తొమ్మిది మంది నోడల్ అధికారులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లింగ్యానాయక్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలపై ఎవరైనా ఫోన్ ద్వారా నోడల్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ నోడల్ అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. అధికారులకు 9247597066కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. నోడల్ అధికారులు ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అలాగే అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత నోడల్ అధికారులదేనని స్పష్టం చేశారు.



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు**

హాజీపూర్ వరుస హత్యలు (తెలంగాణ): యాదాద్రి జిల్లా హాజీపూర్‌లో శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి ముగ్గురు బాలికలను అపహరించి, హత్యాచారం చేసి బావిలో పూడ్చిపెట్టిన ఘటన 2019లో వెలుగులోకి వచ్చింది. కోర్టు అతనికి మరణశిక్ష విధించింది.



## ట్రేడ్ డీల్ ఎఫెక్ట్ : బైక్ లు, కార్లు ఇక చీప్

- **భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం**
- **హార్లే డేవిడ్సన్ బైక్‌లకు భారీ ఊరట**
- **దిగుమతి మోటార్‌సైకిళ్లపై సుంకాలు గణనీయంగా తగ్గింపు**

**ముద్ర, బిజినెస్ న్యూస్ :**

భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో దిగుమతి బైక్‌లు, కార్ల ధరలు తగ్గే అవకాశాలు ఏర్పడ్డాయి. అమెరికా నుంచి దిగుమతయ్యే మోటార్‌సైకిళ్లపై భారత్ భారీగా సుంకాలను తగ్గించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. 800సీసీ నుంచి 1600సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన మోటార్‌సైకిళ్లపై ఇకపై ఎలాంటి దిగుమతి సుంకాలు ఉండబోవని ప్రకటించారు. దీంతో అమెరికా ప్రీమియం బైక్ తయారీ సంస్థ హార్లే డేవిడ్సన్‌కు ఈ నిర్ణయం పెద్ద ఊరటగా మారింది. ఇదివరకే హార్లే డేవిడ్సన్‌కు ప్రభుత్వం సుంకాల విషయంలో కొంత వెసులుబాటు కల్పించింది. గతేడాది 1600సీసీ వరకు ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాహనాలపై 50శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 40శాతానికి తగ్గించింది. అలాగే 1600 సీసీకి మించిన ఇంజిన్ సామర్థ్యం ఉన్న వాహనాలపై 50శాతం సుంకాన్ని 30శాతానికి కుదించింది. తాజాగా కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. దీనిపై మార్చి నెలలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం అమలులోకి వచ్చిన తేదీ నుంచే కొత్త సుంకాల విధానం అమల్లోకి రానుంది. అమెరికా నుంచి దిగుమతయ్యే కార్లపై కూడా భారత్ సుంకాలను తగ్గించింది. 3000 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన పెట్రోల్, డీజిల్ వాహనాలపై పదేళ్ల పాటు 30శాతం చొప్పున సుంకం విధించనుంది. అయితే ఎలక్ట్రిక్ కార్లను ఈ ట్రేడ్ డీల్ నుంచి మినహాయించారు. దీంతో టెస్లాకు ఈసారి పెద్దగా ఊరట లభించలేదు. టెస్లా విక్రయిస్తున్న మోడల్ వై కార్లపై టారిఫ్‌లు యథాతథంగా కొనసాగనున్నాయి. ఇది దేశీయ ఆటోమొబైల్ కంపెనీలైన టాటా, మహీంద్రాలకు ఊరట నిచ్చే అంశంగా పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## ముస్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**కలెక్టర్ ప్రతీక్ జైన్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



వికారాబాద్ జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సూపర్వైజర్లు, అసిస్టెంట్లకు సంబంధించిన ఆదేశాలను ఇప్పటికే సంబంధిత మున్సిపాలిటీలకు పంపినట్లు తెలిపారు. వారికి సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని 9వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు వికారాబాద్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంబంధిత సిబ్బంది సమయానికి హాజరుకావాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో శాంతి, భద్రత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని శాఖలతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎన్నికల ప్రక్రియలో సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు.

## అమెరికా వాణిజ్య ఒప్పందంపై గోయల్ స్పష్టత

**ముద్ర న్యూస్ :**



అమెరికాతో కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం కింద వచ్చే ఐదేళ్లలో భారత్ 500 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందన్న అంచనాలపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టత ఇచ్చారు. ఇది భారత్‌కు ఎలాంటి భారం కాదని, వేగంగా విస్తరిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఇది సాధారణ ప్రక్రియేనని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ ఏటా సుమారు 300 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు చేస్తోందని, వచ్చే ఐదేళ్లలో మొత్తం దిగుమతుల అవసరం దాదాపు రెండు ట్రిలియన్ డాలర్లకు చేరవచ్చని తెలిపారు. ఇప్పటికే భారత్ అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి ఏటా 45 నుంచి 50 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోందని గోయల్ గుర్తు చేశారు. సాంకేతిక రంగంలో భారీ పెట్టుబడులు రానున్నాయని, దేశవ్యాప్తంగా 10 గిగావాట్ల సామర్థ్యంతో డేటా కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. వాటికి అవసరమైన పరికరాలు, యంత్రాలను అమెరికా సరఫరా చేయగలదన్నారు. అలాగే విమానయాన రంగంలో భారత్‌కు భారీ అవసరాలుండగా, బోయింగ్ సంస్థకు మాత్రమే సుమారు 50 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని వెల్లడించారు. డేటా కేంద్రాలు, కృత్రిమ మేధ మిషన్, తయారీ రంగం, ఖనిజాల శుద్ధి వంటి రంగాలకు అధునాతన యంత్రాలు, ఐసీటీ ఉత్పత్తులు అవసరమవుతాయని గోయల్ తెలిపారు. భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే, అమెరికా నుంచి ఏటా 100 బిలియన్ డాలర్ల దిగుమతులు కూడా తక్కువ అంచనానేనని ఆయన స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యేలకు రెఫరెండం...!

- **కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మున్సిపల్ పరీక్ష**
- **అధిక స్థానాలు సాధించాలని అధిష్ఠానం నుంచి స్ట్రాంగ్ వార్నింగ్**
- **అభ్యర్థుల గెలుపుకోసం పలుచోట్ల ఎదురీదుతున్న ఎమ్మెల్యే లు**
- **కాంగ్రెస్‌కు ధీటుగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ప్రచారం**
- **నియోజకవర్గాల్లో తిష్టవేసిన మూడు పార్టీల ముఖ్య నేతలు**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**

'ఎంకి పెళ్లికి సుబ్బి చావుకు వచ్చినట్లు' అన్న నానుడికి అద్దం పడుతూ, మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రెఫరండంగా మారాయి. ఇప్పటికే అధికార పార్టీ ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులకు అధిష్టానం నుంచి స్ట్రాంగ్ వార్నింగ్ అందింది. జిల్లాలోని మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌తోపాటు 18 మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలంటూ అల్టిమేటం జారీ చేసింది. ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి పోలింగ్ వరకు కేవలం 15రోజులే గడువు ఉండటంతో, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు డివిజన్లు-వార్డుల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ నెల 3న విత్‌డ్రా ముగియడం, కేవలం 8 రోజుల ప్రచార గడువు ఉండటంతో ప్రతి వార్డులో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. అధికార పార్టీకి ధీటుగా బీజేపీ, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కూడా ప్రచారంలో ముందంజలో ఉన్నారు.

**అందరి చూపు పాలమూరుపైనే**

ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్ ఒక్కటే కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ కావడంతో తొలిసారిగా కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్నాయి. మేయర్ పదవి దక్కించుకునేందుకు మూడు పార్టీలూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. 60 డివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగరాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. 1.98 లక్షల ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శ్రమిస్తున్నారు. ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి దామోదర రాజనర్సింహ ఒకసారి ప్రచారం నిర్వహించారు. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్ని డివిజన్లలో విస్తృత ప్రచారం చేపట్టారు. బీజేపీ తరఫున ఎంపీ డీకే అరుణ ప్రతి డివిజన్‌లో ప్రచారం పూర్తి చేయగా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ కూడా ఇక్కడ ప్రచారం చేసి వెళ్లారు.

**దేవరకద్రలో హోరాహోరీ**

దేవరకద్ర మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి నువ్వానేనా అన్నట్లుగా ప్రచారం సాగిస్తున్నారు. ఈ నియోజకవర్గంలోని భూత్పూర్, కొత్తకోట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

**మక్తల్‌లో..**

మక్తల్ మున్సిపల్ ఎన్నికలు మంత్రి వాకిటి శ్రీహరికి కత్తిమీద సాముగా మారాయి. ముదిరాజ్ కోటాలో మంత్రి పదవి సాధించిన ఆయనకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఓటమి ఎదురైతే మంత్రి పదవికే గండం అనే భావనతో ప్రచారం సాగిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ కూడా పరిధిలో ఉండటంతో రెండింట్లోనూ గెలిచి రాజకీయ సత్తా చాటాలని యత్నిస్తున్నారు. బీఆర్ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి గత వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. బీజేపీ కూడా బలమైన క్యాడర్‌తో పోటీలో ఉంది. ఇదే ప్రాంతానికి చెందిన ఎంపీ డీకే అరుణ పట్టుదలతో ప్రచారం కొనసాగిస్తున్నారు.

**నారాయణపేటలో..**

నారాయణపేట మున్సిపాలిటీ జనరల్ స్థానం కావడంతో పోటీ తీవ్రంగా మారింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, ఆయన మేనమామ మాజీ డీసీసీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీకి బలమైన పట్టణంగా నారాయణపేట గుర్తింపు పొందింది. దీనిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ గెలుపుకోసం తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నాయి. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్-బీజేపీ మధ్య నలిగిపోతోంది.

**కొడంగల్‌పై ప్రత్యేక దృష్టి**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. బీఆర్ఎస్ మాత్రం ఎలాగైనా కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ ఇవ్వాలని యత్నిస్తోంది. ఇక్కడ బీజేపీ ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. మొత్తంగా ఈ ఎన్నికలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఒక రెఫరండంగా మారాయి.

## డిజిటల్ మీడియా నమ్మకాన్ని నిలబెట్టాలి

- **ఫేక్ న్యూస్‌కు తావివ్వొద్దు: విజయబాబు**

**ముద్ర, కాప్రా:**




డిజిటల్ న్యూస్ మీడియా ఛానళ్లకు అవార్డుల ప్రదానం తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా జరగడం విశేషమని మాజీ సమాచార కమిషనర్ పి. విజయబాబు అన్నారు. విజయవాడలోని హోటల్ లీలా గ్రాండ్‌లో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. డిజిటల్ మీడియా వేగవంతంగా వార్తలను చేరవేయడమే కాకుండా ఖచ్చితమైన, నమ్మదగిన సమాచారాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత మరింత పెరిగిందన్నారు. వార్తలను నిష్పాక్షికంగా, నిజానిజాలు నిర్ధారించుకున్న అనంతరమే ప్రచురించాలని సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తిని అరికట్టడం డిజిటల్ మీడియాకు ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. సమాజంలో అలజడులు సృష్టించే, విద్వేషాలను పెంచే వార్తలను పూర్తిగా నివారించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్తంభంగా ప్రభుత్వాన్ని ప్రజలకు జవాబుదారీగా నిలబెట్టే కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర అడ్వకేట్ ఫోరం కన్వీనర్ బి.అశోక్ కుమార్, దూరదర్శన్ మాజీ అధికారి ఎన్.వి.హనుమంతరావు, సోషల్ మీడియా క్లబ్ ఆఫ్ ఏపీ చైర్మన్ సన్ మూర్తి, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తిప్పరాజు రమేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కృష్ణంరాజు, అసోసియేషన్ కన్వీనర్ ఎం.ఆర్. పాషా తదితరులు పాల్గొన్నారు.

**డిజిటల్ మీడియా ఆఫ్ ది ఇయర్ అవార్డు..**

డిజిటల్ న్యూస్ మీడియా ఆఫ్ ది ఇయర్ 2026 అవార్డును ధర్మపీఠం విత్ ఏబీఆర్ డిజిటల్ న్యూస్ మీడియా ఛానల్ చైర్మన్ భాస్కర్ రెడ్డికి ప్రదానం చేశారు. ఈ అవార్డు డిజిటల్ మీడియా రంగానికి మరింత ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## హామీలు ఎగ్గొట్టిన నువ్వే అసలైన 'నకిలీ'

- **మాట నిలబెట్టుకున్న కేసీఆర్ అసలీ**
- **మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శ**

**ముద్ర, సంగారెడ్డి :**



అమలుకాని హామీలు, వాగ్దానాలు, గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి వాటిని ఎగ్గొట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలైన 'నకిలీ' అని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో అసలు ఎవరో, నకిలీ ఎవరో ప్రజలందరికీ బాగా తెలుసన్నారు. హామీలు ఇచ్చి అమలు చేసిన కేసీఆర్ అసలైన నాయకుడని స్పష్టం చేశారు. రూ. 4వేల పెన్షన్, రూ. 2,500 మహాలక్ష్మి, నిరుద్యోగ భృతి, తులం బంగారం వంటి ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు రూ. 40 వేల కోట్లు చెల్లించేందుకు డబ్బులు ఉన్నాయి కానీ, ఉద్యోగులకు, పేదలకు ఇవ్వడానికి మాత్రం నిధులు లేవా అని ప్రశ్నించారు. గల్లీల్లో పారే మురుగు నీటికంటే రేవంత్ నోటి నుంచి వచ్చే మాటలే ఎక్కువ దుర్వాసన వెదజల్లుతున్నాయని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సంగారెడ్డి పట్టణంలో పర్యటించిన హరీశ్ రావు మాట్లాడుతూ... తెలంగాణ సాధిస్తానని చెప్పి సాధించి చూపిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. రూ. 2 వేల పింఛన్ ఇస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్నదీ కేసీఆర్‌నేనన్నారు. కళ్యాణ లక్ష్మి కింద రూ. లక్ష, కేసీఆర్ కిట్ కింద రూ. 13వేలు ఇచ్చి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఇదే అసలైన నాయకుడి లక్షణమన్నారు. సంగారెడ్డి పట్టణ అభివృద్ధి మొత్తం కేసీఆర్ హయాంలోనే జరిగిందని చెప్పారు. రూ. 34 కోట్లతో ఇంటింటికి మంచినీటి సరఫరా చేసి అక్కచెల్లెళ్ల కష్టాలు తీర్చామని గుర్తు చేశారు. చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్లు, వీధి దీపాలు, డివైడర్లు అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. సంగారెడ్డికి మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల మంజూరు చేశారని తెలిపారు. టీయూఎఫ్ ఐడీసీ కింద రూ. 50 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద రూ. 25 కోట్లు మంజూరు చేసి సంగారెడ్డిని అభివృద్ధి చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు గడిచినా సంగారెడ్డిలో ఎక్కడా ఒక్క రూపాయి పనీ జరగలేదని ఆరోపించారు. ఎన్నికలు వస్తున్నాయంటే టెండర్లు, అనుమతులు లేకుండా కొబ్బరికాయలు కొట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. రెండేళ్లలో రూ. ఎనిమిది కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఒక్కో వార్డుకు రూ. 8 కోట్లు ఇస్తామంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొత్తం కమిషన్ల ప్రభుత్వమని, రూ. 95 వేల కోట్ల టెండర్లు పిలిచి డబ్బులు పంచేందుకు సిద్ధంగా ఉందన్నారు. రూ. 40 వేల కోట్లు కాంట్రాక్టర్లు, మిత్రులకు కమిషన్ల రూపంలో వెళ్లుతున్నాయని, కానీ రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించేందుకు మాత్రం డబ్బులు లేవా అని నిలదీశారు.




## రూ.7 కోట్ల విలువైన పార్కు భూమికి రక్షణ

- **1253 గజాల స్థలానికి హైడ్రా ఫెన్సింగ్**

**ముద్ర, హైదరాబాద్ :**

సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి కాలనీలో ఉన్న 1253.8 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు ఆదివారం కాపాడారు. ఈ స్థలం విలువ సుమారు రూ.7 కోట్లుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. చక్రపురి కాలనీ సంక్షేమ సంఘం, పార్కు స్థలం అక్రమ ఆక్రమణలకు గురవుతోందని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. దీనిపై హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలన చేపట్టారు. అమీన్పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 135లో ఉన్న ఈ పార్కు భూమి మొత్తం 1253.8 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది. గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ నంబర్ 12343/2022 (తేదీ: 31 మార్చి 2022) ప్రకారం, లేఅవుట్ వేసిన వారు ఈ స్థలాన్ని ప్రజా వినియోగం కోసం స్థానిక సంస్థలకు అప్పగించారు. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) లేఅవుట్ అనుమతి సంఖ్య 3814/ఎంపీ2/హుడా/85 ప్రకారం ఈ స్థలాన్ని పార్కులు, రహదారుల అభివృద్ధికి కేటాయించారు. అయితే పార్కు స్థలానికి సంబంధించిన సరిహద్దు రాళ్లు తొలగించినట్లు గుర్తించారు. దీనితో హైడ్రా అధికారులు తక్షణ చర్యలు తీసుకొని పార్కు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే ఇది పార్కు స్థలAమని తెలియజేస్తూ హైడ్రా బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. పార్కు భూమిని కాపాడిన హైడ్రా చర్యలపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 'హైడ్రా జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
09.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు



ప్రణయ్ హత్య (మిర్యాలగూడ): 2018లో కులాంతర వివాహం చేసుకున్నాడన్న కోపంతో, భార్య తండ్రి కిరాయి హంతకులతో ప్రణయ్‌ను దారుణంగా నరికించిన ఘటన తెలుగు రాష్ట్రాల్లో పరువు హత్యలపై చర్చకు దారితీసింది.




# ఇంగ్లండ్ కు చెమటలు పట్టించిన నేపాల్

- చివరి బంతికి గట్టెక్కిన ఇంగ్లాండ్
- పోరాడి ఓడిన నేపాల్

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్



టీ20 ప్రపంచకప్‌లో పసికూన నేపాల్ సంచలన విజయం అంచుల దాకా వెళ్లి చివరి క్షణంలో చేజార్చుకుంది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత గ్రూప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ చేతిలో నేపాల్ 4 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది.
185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ 20 ఓవర్లలో 180/6కే పరిమితమైంది. దీపేంద్ర సింగ్ (44), రోహిత్ (39), లోకేశ్ బామ్ (39*) కీలకంగా ఆడగా, మూడో వికెట్‌కు దీపేంద్ర-రోహిత్ జోడీ 82 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. చివరి బంతికి ఆరు పరుగులు అవసరమైన వేళ ఒక్క పరుగు మాత్రమే రావడంతో నేపాల్ ఆశలు ఆవిరయ్యాయి.
అంతకుముందు ఇంగ్లాండ్ 20 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. జాకబ్ (55), బ్రూక్ (53) అర్ధశతకాలతో మెరిశారు. బౌలింగ్‌లో లియామ్ రెండు వికెట్లు తీయగా, జోఫ్రా, విల్ జాక్స్, సామ్ కరన్, ల్యూక్ చెరో వికెట్‌తో ఇంగ్లాండ్‌కు విజయం అందించారు. నేపాల్ పోరాటం అభిమానుల ప్రశంసలు దక్కించుకుంది.

# సూర్య పోరాటం, అశ్విన్ ప్రశంసలు..

**భారత్‌కు హెచ్చరికగా యూఎస్ఏ మ్యాచ్**

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్ :

టీ20 ప్రపంచకప్‌లో యూ ఎ స్ ఏ తో జరిగిన మ్యాచ్‌లో సూ ర్య కు మా ర్ యాదవ్ భారత జట్టును కష్టాల నుంచి బయటపడేశాడు. 49 బంతుల్లో 84 పరుగులు చేసి అజేయంగా నిలిచి, 77/6 నుంచి భారత్‌ను 161 పరుగుల వరకు తీసుకెళ్లాడు. జట్టు స్కోర్‌లో సగానికి పైగా పరుగులు సూర్య బ్యాట్ నుంచే రావడం విశేషం.
ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ, గత ఏడాది ఫామ్ కోల్పోయిన సూర్య తిరిగి పాత లయను అందుకున్నాడని కొనియాడాడు. వికెట్ల వెనుక నుంచి పరుగులు రాబట్టడం ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నాడు. డెత్ ఓవర్లలో సూర్య చూపిన దూకుడు నిజమైన 360 డిగ్రీ బ్యాటింగ్‌కు ఉదాహరణగా అభివర్ణించాడు.
అయితే సూర్య ఇన్నింగ్స్‌ను పక్కనపెడితే, ఈ మ్యాచ్ భారత జట్టుకు హెచ్చరికగా మారిందని అశ్విన్ వ్యాఖ్యానించాడు. పవర్‌ప్లేలో నాలుగు వికెట్లు కోల్పోవడం ఆందోళనకరమన్నాడు. పిచ్ స్వభావాన్ని తొలినాళ్లలోనే అర్థం చేసుకుని ఆడితే భారత్ మరో 20-30 పరుగులు అదనంగా సాధించేదని అభిప్రాయపడ్డాడు. అయినప్పటికీ 161 పరుగులను కాపాడుకోవడం భారత్ సాధించిందని గుర్తు చేశాడు.
మ్యాచ్ అనంతరం సూర్య మాట్లాడుతూ, గత



ఏడాది తనకు మానసికంగా కష్టంగా గడిచిందని, కొంత విరామం తీసుకోవడం మళ్లీ ఫామ్‌లోకి రావడానికి సహాయపడిందని తెలిపాడు.

# తొలి బంతికే వికెట్...

**టీ20 వరల్డ్‌కప్‌లో నేపాల్ బౌలర్ షేర్ మల్లా అరుదైన రికార్డు**

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

నేపాల్ ఆఫ్‌బ్రేక్ బౌలర్ షేర్ మల్లా క్రికెట్ చరిత్రలో తన పేరు లిఖించుకున్నాడు. అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో తొలి బంతికే వికెట్ పడగొట్టి అరుదైన ఘనతను సాధించాడు. ఈ రికార్డు సాధారణ మ్యాచ్‌లో కాకుండా, టీ20 వరల్డ్‌కప్ లాంటి మెగా టోర్నీలో నమోదు కావడం విశేషంగా మారింది.
మల్లాకు ముందు వరల్డ్‌కప్‌లో కెరీర్ తొలి బంతికే వికెట్ తీసిన ఘనత కేవలం ఐదుగురికే దక్కింది. ఫిడేల్ ఎడ్వర్డ్స్, ప్రగ్యాన్ ఓఝా, పరాస్ ఖడ్కా, నదీమ్ అహ్మద్, ఖుర్రమ్ ఖాన్ ఈ జాబితాలో ఉన్నారు. వీరిలో ఇప్పటికే నేపాల్‌కు చెందిన పరాస్ ఖడ్కా ఉండటం గమనార్హం. అంతేకాదు, మల్లాకు ముందు పరాస్ ఖడ్కా, ఆరిఫ్ షేక్, కుశాల్ భుర్టెల్ కూడా తమ కెరీర్ తొలి బంతికే వికెట్ తీసిన నేపాల్ ఆటగాళ్లుగా గుర్తింపు పొందారు.
ఇదిలా ఉండగా, టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా ఫిబ్రవరి 8న ముంబై వేదికగా నేపాల్-ఇంగ్లండ్ మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ ముందుగా బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. జేకబ్ బేతెల్ (55), హ్యారీ బ్రూక్ (53) అర్ధ సెంచరీలతో జట్టును ఆదుకోగా, చివర్లో విల్ జాక్స్ (38 నాటౌట్) వేగంగా పరుగులు సాధించాడు.
మిగతా బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ 1, జోస్ బట్లర్ 26, టామ్ బాంటన్ 2, సామ్ కర్రన్ 2, జోఫ్రా ఆర్చర్ 1 పరుగు మాత్రమే చేశారు. నేపాల్ బౌలర్లలో నందన్ యాదవ్, దీపేంద్ర సింగ్ ఎయిరీ తలో రెండు వికెట్లు తీయగా, షేర్ మల్లా, సందీప్ లామిచ్చానే చెరో వికెట్ సాధించారు. మల్లా తీసిన తొలి వికెట్ ఫిల్ సాల్ట్‌ది.
185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ 7 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసింది. భుర్టెల్ (29), ఆసిఫ్ షేక్ (7) ఔటవ్వగా, రోహిత్ పౌడెల్ (10), దీపేంద్ర సింగ్ ఎయిరీ (10) క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో డాసన్, జాక్స్ చెరో వికెట్ తీశారు. ఈ దశలో నేపాల్ విజయం సాధించాలంటే మిగిలిన 78 బంతుల్లో 125 పరుగులు చేయాల్సి ఉంది.



# భారత్‌తో మ్యాచ్‌పై పాక్ వెనకడుగు? ఐసీసీ జోక్యంతో మారుతున్న వైఖరి

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

క్రికెట్‌లో రాజకీయాల్ని కలపడం పాకిస్థాన్‌కు కొత్త కాదు. టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా శ్రీలంకలో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను కారణం లేకుండా తప్పించుకోవాలన్న పాక్ ప్రయత్నాలు ఇప్పుడు ఐసీసీ దృష్టికి వెళ్లాయి. ఈ అంశంపై స్పష్టత తీసుకురావాలనే ఉద్దేశంతో ఐసీసీ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ మధ్య వర్చువల్ సమావేశం జరగనుంది. ఇదే సమయంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్ అమిన్ ఉల్ ఇస్లామ్ కరాచీ చేరుకుని పీసీబీ ఛైర్మన్ నఖ్వీతో భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఆయన కూడా ఐసీసీ-పీసీబీ చర్చల్లో పాల్గొనే అవకాశముందని సమాచారం.
షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్, పాకిస్థాన్ జట్లు తలపడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్‌తో మ్యాచ్ ఆడబోమని పాక్ ప్రకటించింది. ఈ నిర్ణయంపై పాక్ ప్రభుత్వం ఆదేశాలున్నాయంటూ పీసీబీ స్పష్టత ఇవ్వకుండా తప్పించుకుంటోంది. మరోవైపు, భారత్‌తో మ్యాచ్‌ను బాయికాట్ చేయవద్దని శ్రీలంక క్రికెట్ బోర్డ్ ఇటీవల పాక్‌కు లేఖ రాసింది. ఆ తర్వాత పాక్ వైఖరిలో స్వల్ప మార్పు కనిపిస్తున్నట్లు సమాచారం.
ప్రభుత్వ నిర్ణయాలనే సాకుగా చూపుతూ, యుద్ధం లేదా ప్రకృతి విపత్తుల వంటి సందర్భాల్లో వర్తించే 'ఫోర్స్ మెజ్యూర్' నిబంధన కింద మినహాయింపు ఇవ్వాలని పాక్ ఐసీసీని కోరిందని తెలుస్తోంది. కానీ వాస్తవ పరిస్థితులు అలాంటివి కాకపోవడంతో ఐసీసీ ఈ వాదనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సరైన కారణాలు చూపకపోతే కఠిన చర్యలు తప్పవని పీసీబీకి స్పష్టంగా హెచ్చరించినట్లు సమాచారం.
ఈ పరిణామాల నేపథ్యంలో పాక్ ధోరణి కాస్త సాఫ్ట్ అయినట్లు తెలుస్తోంది. భారత్‌తో మ్యాచ్ ఆడే అవకాశం పెరిగిందని ఐసీసీ వర్గాలే సంకేతాలు ఇస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా కొలంబో వెళ్లి శ్రీలంక క్రికెట్ బోర్డ్ అధ్యక్షుడు షమ్మీ సిల్వాతో సమావేశమయ్యారన్న వార్తలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.





భారత్‌లో తొలిసారి కిక్‌బాక్సింగ్ సూపర్ లీగ్...

# క్రీడకు కొత్త ఊపిరి

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

భారత్‌లో కిక్‌బాక్సింగ్‌ను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో తొలిసారిగా కిక్‌బాక్సింగ్ సూపర్ లీగ్ (కేఎస్ఎల్) ప్రారంభం కానుంది. దిల్లీలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ లీగ్‌ను అధికారికంగా ప్రకటించారు. వాకో ఇండియా నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్న సందర్భంలోనే కేఎస్ఎల్‌కు శ్రీకారం చుట్టడం విశేషంగా నిలిచింది.
దేశంలో కిక్‌బాక్సింగ్‌కు గుర్తింపు పెంచడం, క్రీడాకారులకు స్థిరమైన అవకాశాలు కల్పించడం ఈ లీగ్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. నిర్మాణాత్మక పోటీలు, అథ్లెట్లకు ఒప్పందాలు, ప్రతిభకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు వేదిక కల్పించడమే లక్ష్యంగా ఈ లీగ్‌ను రూపొందించినట్లు వెల్లడించారు.
సీజన్-1లో మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీ జట్లు పాల్గొననున్నాయి. ఒక్కో జట్టులో 34 మంది ఫైటర్లు ఉండగా, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. మొత్తం క్రీడాకారుల్లో 60 శాతం పురుషులు, 40 శాతం మహిళలు ఉండనుండగా, 20 శాతం వరకు అంతర్జాతీయ అథ్లెట్లకు అవకాశం కల్పించనున్నారు. ఈ లీగ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి రూ.కోటి నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.
కేఎస్ఎల్ సహవ్యవస్థాపకుడు అజయ్ అడ్లఖ మాట్లాడుతూ, లీగ్‌ను పారదర్శకంగా, పటిష్ఠమైన విధానాలతో నిర్వహిస్తామని తెలిపారు. దీని ద్వారా క్రీడాకారులు, జట్లు, భాగస్వాములందరికీ లాభం చేకూరుతుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రతినిధులు, జాతీయ క్రీడాశాఖ అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.
లీగ్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంపిక శిబిరాల ద్వారా అథ్లెట్లను ఎంపిక చేస్తారు. చివరగా క్రీడాకారుల వేలం నిర్వహించి, జట్ల యాజమాన్యాలతో సీజన్‌వారీ కాంట్రాక్టులు కుదుర్చుకుంటారు.




# అమెరికా పోరాటం–సూర్య ప్రశాంతత

- టీమిండియా విజయంపై సచిన్ ప్రశంసలు

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో టీమిండియా గెలిచినా, ఆ విజయం అంత సులువు కాదు. అమెరికా బౌలర్లు కట్టుదిట్టమైన ప్రణాళికతో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టగా, ఓ దశలో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. అలాంటి సమయంలో సూర్యకుమార్ యాదవ్ తన అనుభవం, నిగ్రహంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అతడి నాయకత్వ ఇన్నింగ్స్‌నే మ్యాచ్ దిశను మార్చింది.
ఈ మ్యాచ్‌పై క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్స్' వేదికగా స్పందించిన సచిన్, అమెరికా జట్టు చూపిన పోరాట పటిమను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. పెద్ద వేదికపై కొత్త జట్లు ఇంత ధైర్యంగా ఆడితే క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరిస్తుందన్నారు. అమెరికా ఆటగాళ్ల ఉత్సాహం, పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
అలాగే సూర్యకుమార్ యాదవ్ ఇన్నింగ్స్‌పై సచిన్ ప్రత్యేక ప్రశంసలు చేశారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడి జట్టును గౌరవప్రదమైన స్కోరుకు చేర్చాడని కొనియాడారు. ఆ తర్వాత భారత బౌలర్లు బాధ్యతను సమర్థంగా నెరవేర్చారని తెలిపారు. టోర్నీని విజయంతో ప్రారంభించడం ఎప్పుడూ శుభసూచకమని సచిన్ అభిప్రాయపడ్డారు.





# పంజాబ్ వీధుల నుంచి ప్రపంచకప్ వరకు..

- ఉబెర్ డ్రైవర్‌గా మొదలై ఇటలీ జెర్సీ ధరించిన జస్ప్రీత్ సింగ్

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

పంజాబ్‌లోని ఫగవాడ వీధుల్లో క్రికెట్ ఆడిన ఓ బాలుడు.. కటిక పేదరికం, వలస కష్టాలను దాటుకుని ఈరోజు ఇటలీ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రపంచకప్ వేదికపై కనిపిస్తున్నాడు. జస్ప్రీత్ సింగ్ ప్రయాణం నిజంగా సినిమాకి ఏమాత్రం తీసిపోదు.
పదేళ్ల వయసులోనే కుటుంబంతో కలిసి ఉపాధి కోసం ఇటలీకి వలస వెళ్లిన జస్ప్రీత్, కొత్త భాష, కొత్త సంస్కృతి మధ్య జీవనం సాగించాడు. తల్లిదండ్రులు ఫ్యాక్టరీల్లో కూలీలుగా పనిచేస్తుండగా.. అతడు మాత్రం క్రికెట్‌పై తన ప్రేమను వదల్లేదు. ఇటలీలో సరైన మైదానాలు లేకపోయినా, ఎప్పుడో ఒక రోజు పెద్ద క్రికెటర్ కావాలనే కలను గుండెల్లో దాచుకున్నాడు.
క్రికెట్‌లో ముందుకెళ్లాలనే తపనతో జస్ప్రీత్ ఇంగ్లాండ్ చేరాడు. బర్మింగ్‌హామ్‌లో ఖర్చుల కోసం ఉబెర్ డ్రైవర్‌గా పనిచేస్తూ, ఖాళీ సమయంలో టర్ఫ్ వికెట్లపై సాధన చేశాడు. అదే పట్టుదల అతడిని స్థానిక లీగ్‌లలో రాణించేలా చేసి, 2019లో ఇటలీ జాతీయ జట్టులో చోటు దక్కేలా చేసింది. తర్వాతి ఏడాదుల్లో నిరాశలు ఎదురైనా వెనకడుగు వేయని జస్ప్రీత్.. 2025 యూరోపియన్ క్వాలిఫైయర్స్‌లో ఇటలీని అగ్రస్థానంలో నిలిపి, 2026 టీ20 ప్రపంచకప్ టికెట్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.

**ప్రస్తుతంపంజాబ్ వీధుల నుంచి ప్రపంచకప్ వరకు.. ఉబెర్ డ్రైవర్‌గా మొదలై ఇటలీ జెర్సీ ధరించిన జస్ప్రీత్ సింగ్**

పంజాబ్‌లోని ఫగవాడ వీధుల్లో క్రికెట్ ఆడిన ఓ బాలుడు.. కటిక పేదరికం, వలస కష్టాలను దాటుకుని ఈరోజు ఇటలీ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రపంచకప్ వేదికపై కనిపిస్తున్నాడు. జస్ప్రీత్ సింగ్ ప్రయాణం నిజంగా సినిమాకి ఏమాత్రం తీసిపోదు.
పదేళ్ల వయసులోనే కుటుంబంతో కలిసి ఉపాధి కోసం ఇటలీకి వలస వెళ్లిన జస్ప్రీత్, కొత్త భాష, కొత్త సంస్కృతి మధ్య జీవనం సాగించాడు. తల్లిదండ్రులు ఫ్యాక్టరీల్లో కూలీలుగా పనిచేస్తుండగా.. అతడు మాత్రం క్రికెట్‌పై తన ప్రేమను వదల్లేదు. ఇటలీలో సరైన మైదానాలు లేకపోయినా, ఎప్పుడో ఒక రోజు పెద్ద క్రికెటర్ కావాలనే కలను గుండెల్లో దాచుకున్నాడు.
క్రికెట్‌లో ముందుకెళ్లాలనే తపనతో జస్ప్రీత్ ఇంగ్లాండ్ చేరాడు. బర్మింగ్‌హామ్‌లో ఖర్చుల కోసం ఉబెర్ డ్రైవర్‌గా పనిచేస్తూ, ఖాళీ సమయంలో టర్ఫ్ వికెట్లపై సాధన చేశాడు. అదే పట్టుదల అతడిని స్థానిక లీగ్‌లలో రాణించేలా చేసి, 2019లో ఇటలీ జాతీయ జట్టులో చోటు దక్కేలా చేసింది.
తర్వాతి ఏడాదుల్లో నిరాశలు ఎదురైనా వెనకడుగు వేయని జస్ప్రీత్.. 2025 యూరోపియన్ క్వాలిఫైయర్స్‌లో ఇటలీని అగ్రస్థానంలో నిలిపి, 2026 టీ20 ప్రపంచకప్ టికెట్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.
ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్న ప్రపంచకప్‌లో ఆడటం జస్ప్రీత్‌కు భావోద్వేగ క్షణం. చిన్నప్పుడు టీవీలో చూసిన వాంఖడే, ఈడెన్ గార్డెన్స్ వంటి మైదానాల్లో దిగడం తన జీవితంలో అతిపెద్ద విజయమని చెబుతున్నాడు. ఉబెర్ డ్రైవర్ స్థాయి




నుంచి ప్రపంచకప్ ఆటగాడిగా ఎదిగిన జస్ప్రీత్ సింగ్.. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.
భారత్‌లో జరుగుతున్న ప్రపంచకప్‌లో ఆడటం జస్ప్రీత్‌కు భావోద్వేగ క్షణం. చిన్నప్పుడు టీవీలో చూసిన వాంఖడే, ఈడెన్ గార్డెన్స్ వంటి మైదానాల్లో దిగడం తన జీవితంలో అతిపెద్ద విజయమని చెబుతున్నాడు. ఉబెర్ డ్రైవర్ స్థాయి నుంచి ప్రపంచకప్ ఆటగాడిగా ఎదిగిన జస్ప్రీత్ సింగ్.. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
09.02.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 10 నేరాలు**

గోకుల్ చాట్ - లుంబినీ పార్క్ పేలుళ్లు (హైదరాబాద్): 2007లో ఒకేరోజు జరిగిన ఈ వరుస బాంబు దాడుల్లో 40 మందికి పైగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన నగరంపై తీవ్రమైన తీవ్రవాద నీడను కమ్మేలా చేసింది.









# హీరోయిన్ల నెంబర్ గేమ్ మాయమైందా?

ఒక సినిమాను నిలబెట్టే బాధ్యత హీరోదే కాదు... కథానాయిక పాత్ర కూడా అంతే కీలకం. కొన్ని చిత్రాల్లో హీరోయిన్ పాత్ర కథను ముందుకు నడిపిస్తే, మరికొన్నింట్లో ఆమెకు పాటలు, గ్లామర్‌కే పరిమితమైన స్థానం దక్కుతుంది. స్టార్ హీరోల సినిమాల్లో కథానాయికలను కేవలం అలంకారంగా ఉపయోగిస్తున్నారనే విమర్శలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. అయితే కమర్షియల్ సినిమాల్లోనూ అప్పుడప్పుడూ హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యత దక్కిన ఉదాహరణలు లేకపోలేదు .v కథానాయిక కెరీర్ పూర్తిగా ఆమెకు దక్కిన అవకాశాలను ఎలా వినియోగించుకుంటుందనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఆమె ఎంచుకునే కథలు, పాత్రలే కెరీర్ గ్రాఫ్‌ను నిర్ణయిస్తాయి. ఒకప్పుడు టాలీవుడ్‌లో హీరోయిన్ల మధ్య 'నెంబర్ వన్' పోటీ పెద్ద చర్చగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ నెంబర్ గేమ్ అసలు వినిపించడమే లేదు. వరుసగా రెండు విజయాలు వస్తే టాప్ అంటారు... అదే రెండు ఫ్లాప్‌లు పడితే వెంటనే వెనక్కి నెట్టేస్తున్నారు. కొన్నాళ్లు తెలుగు పరిశ్రమను ఏలిన అనుష్క, కాజల్, సమంత, తమన్నా లాంటి భామలు ఇప్పుడు లీడ్ రేస్‌కు దూరంగా ఉన్నారు. ఇటీవల వరకు టాప్ ప్లేస్‌లో ఉన్నట్లు కనిపించిన రష్మిక కూడా బాలీవుడ్ వైపు దృష్టి పెట్టడంతో టాలీవుడ్‌లో ఆ స్థానం ఖాళీ అయినట్టే. దీంతో కొత్త కథానాయికలకు అవకాశాలు మరింతగా తెరుచుకుంటున్నాయి. భాగ్యశ్రీ, శ్రీలీల, రుక్మిణి వసంత్ లాంటి కొత్త తరం హీరోయిన్లు ప్రస్తుతం మంచి బజ్ క్రియేట్ చేస్తున్నా... వీరిలో ఎవరు నిజంగా టాప్ రేంజ్‌కు చేరుతారన్నదానిపై స్పష్టత లేదు. ఎందుకంటే వరుస విజయాలు సాధించినా ఒక్కటి రెండు సినిమాలు నిరాశపరిస్తే చాలు, అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొత్త ముఖాలకు అవకాశాలు దక్కేందుకు కారణమవుతోంది. మొత్తానికి టాలీవుడ్‌లో కథానాయికల కొరత ఎప్పటికీ ఉండే అంశమే. గరిష్టంగా ఐదు నుంచి ఆరు సంవత్సరాలు స్టార్ ఫామ్ కొనసాగించగలిగినా, ఆ తర్వాత గ్రాఫ్ పడిపోవడం సాధారణంగా మారింది. అయితే కొద్దిమంది మాత్రమే క్రమబద్ధమైన కెరీర్ ప్లానింగ్‌తో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించే స్థాయికి చేరుతున్నారు. గ్లామర్‌తో పాటు పాత్రలకు ప్రాధాన్యత ఇచ్చుకుంటూ ముందుకు వెళ్లినప్పుడే దీర్ఘకాలిక కెరీర్ సాధ్యమవుతుందన్నది నేటి టాలీవుడ్



## బుట్టబొమ్మకు షాకిచ్చిన బుడ్డోడు

• **మోనికా సాంగ్ ను అచ్చుగుద్దేశాడు**

బుట్టబొమ్మ పూజా హెగ్డే నటించిన కూలీ సినిమాలోని 'మోనికా' పాటకు ఓ చిన్నారి వేసిన డ్యాన్స్ స్టెప్పులు నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల తమిళనాడులో నిర్వహించిన ఓ కార్యక్రమానికి పూజా హెగ్డే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిమానుల అభ్యర్థన మేరకు ఆమె వేదికపైకి వచ్చి 'మోనికా' పాటకు సరదాగా డ్యాన్స్ చేశారు. అదే సమయంలో స్టేజ్‌పైకి వచ్చిన ఓ బుడతడు అందరి దృష్టిని ఒక్కసారిగా తనవైపు తిప్పేశాడు. చిన్న వయసులోనే అద్భుతమైన ఎనర్జీతో, చక్కటి టైమింగ్‌తో చేసిన అతడి స్టెప్పులు అక్కడున్న వారిని మాత్రమే కాదు... పూజా హెగ్డేను కూడా ఆశ్చర్యపరిచాయి. ఆమె కూడా నవ్వుతూ అతడి డ్యాన్స్‌ను ఎంజాయ్ చేసిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఈ సరదా ఘట్టానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వేగంగా షేర్ అవుతూ, చిన్నారి టాలెంట్‌పై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



## అనుదీప్... నువ్వు మారలేదు

**ఆకట్టుకుంటున్న ఫంకీ ట్రైలర్**

విశ్వక్ సేన్ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎంటర్‌టైనర్ ఫంకీపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జాతిరత్నాలుతో ప్రేక్షకుల నవ్వులు కొల్లగొట్టిన డైరెక్టర్ అనుదీప్ కేవీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా, పేరు చెప్పినట్టే ఫుల్ ఫంకీగా థియేటర్లలో హంగామా చేయడానికి సిద్ధమైంది. ఈ చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రేమికుల దినోత్సవ కానుకగా ఈ నెల 13న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే టీజర్, పాటలతో అంచనాలు పెంచిన మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్ స్టార్ట్ అయిన క్షణం నుంచే అనుదీప్ తన ట్రేడ్‌మార్క్ కామెడీతో దంచేశాడు. పంచ్ డైలాగ్స్, వింత సిట్యుయేషన్స్, గలీజ్ హ్యూమర్‌తో ట్రైలర్ మొత్తం నాన్‌స్టాప్ నవ్వులు పూయిస్తోంది. "మీ అమ్మకు ఆపరేషన్ చేయాలంటే నాకు రాదు డాక్టర్" అనే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్, "ఓనర్‌కు రెంట్ కట్టుడు వంటివన్నీ నాకు గలీజ్ అనిపిస్తాయ్" అన్న హీరో కామెడీతో మరో లెవల్‌కు వెళ్తుంది. ఇక "మీ అమ్మ కోడలు అనడం, మా నాన్న అల్లుడు అనడం కూడా గలీజ్ అనిపిస్తాయ్" అంటూ హీరోయిన్ వేసిన పంచ్ అయితే ట్రైలర్‌కే హైలెట్‌గా మారింది. మొత్తానికి ఈసారి కూడా అనుదీప్ తన స్టైల్ మార్చలేదు... ప్రేక్షకుల నవ్వు కంట్రోల్ పోయేలా చేసే మెటీరియల్‌ను ఫంకీలో ప్యాక్ చేసినట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాకు మరింత ఊపు ఇస్తుండగా, డైరెక్టర్ అనుదీప్ స్వయంగా ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారన్న టాక్ కూడా ఆసక్తి పెంచుతోంది. సారాంశం ఏంటంటే... వాలెంటైన్స్ డే వీక్‌లో లవ్ కాదు, లాఫ్ కావాలంటే ఫంకీ థియేటర్లలో ఖాయం!




## కొత్త అవకాశాలు చిక్కేనా?

టాలీవుడ్‌లో ప్రగ్యా జైస్వాల్ ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. దశాబ్దం క్రితం కంచె సినిమాతో బలమైన అరంగేట్రం చేసిన ఆమె, ఆ చిత్రానికి గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డు కూడా అందుకోవడంతో భవిష్యత్తు స్టార్‌గా గుర్తింపు పొందింది. అయితే ఆ తర్వాత వచ్చిన గుంటూరోడు, నక్షత్రం వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె కెరీర్ గతి కొంత మందగించింది. కొన్నేళ్ల విరామం అనంతరం 2021లో విడుదలైన అఖండతో తిరిగి ఫామ్‌లోకి వచ్చింది. భారీ కమర్షియల్ చిత్రాన్ని కూడా ఆమె సక్సెస్‌ఫుల్‌గా హ్యాండిల్ చేయగలదని ఈ సినిమాతో నిరూపించింది. ఇటీవల డాకు మహారాజ్ సినిమాలో గర్భిణీ దొంగ పాత్రలో బలమైన నటనతో కనిపించి మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అయినప్పటికీ గత ఏడాది ఆమెకు ఒక్క సినిమా మాత్రమే రావడం, టాలీవుడ్‌లో ఇంకా స్థిరమైన అవకాశాల కోసం పోరాటం కొనసాగుతోందనే విషయాన్ని సూచిస్తోంది.



## మార్చి నుంచి సెట్స్ లోకి మెగా ఎంట్రీ

సక్సెస్ జోరులో ఉన్న మెగాస్టార్ చిరంజీవి పెద్దగా బ్రేక్ తీసుకోకుండా మరో కొత్త సినిమాకు సిద్ధమవుతున్నారు. మార్చి నుంచే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రణాళికలను చిత్రబృందం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. సంక్రాంతి కానుకగా విడుదలైన మన శంకరవరప్రసాదారు సినిమాతో ఘన విజయాన్ని అందుకున్న చిరంజీవి, ఆ సినిమా షూటింగ్ దశలోనే మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాల్తేరు వీరయ్య దర్శకుడు బాబీ కొల్లి ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ప్రీప్రొడక్షన్ పనులన్నీ పూర్తి చేసిన బాబీ, సినిమాను త్వరగా పట్టాలెక్కించేందుకు రెడీ అవుతున్నారని టాక్. తండ్రి-కూతురు భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు సమాచారం. కూతురు పాత్రకు మొదట కృతిశెట్టి పేరు వినిపించినప్పటికీ, తాజాగా సారా అర్జున్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉండగా, ఒక సీనియర్ హీరోయిన్ పాత్రపై ఇప్పటికే చర్చ జరుగుతోంది. మరో హీరోయిన్ ఎంపికపై చిత్రబృందం ఇంకా కసరత్తు చేస్తోంది. వాల్తేరు వీరయ్య తర్వాత చిరంజీవి-బాబీ కలయికలో వస్తున్న ఈ సినిమా పై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



## శ్రీవారిని దర్శించుకున్న నిధి అగర్వాల్

సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఆలయానికి చేరుకున్న ఆమె, సంప్రదాయ వస్త్రాలు ధరించి భక్తిశ్రద్ధలతో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం నిధికి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనం తర్వాత ఆలయ ప్రాంగణంలో ఆమెను చూసిన అభిమానులు సెల్ఫీల కోసం ఆసక్తి చూపగా, కొందరికి నిధి చిరునవ్వుతో సెల్ఫీలు ఇచ్చారు. ఆమె రాకతో తిరుమల ఆలయ ప్రాంతం కాసేపు సందడిగా మారింది.



## ఆ కొరతే దురందర్ వసూళ్లకు అడ్డు

• **అమీర్ ఖాన్**

గతేడాది బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దురంధర్ 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. డిసెంబర్ 5న విడుదలైన ఈ మూవీ దేశవ్యాప్తంగా రూ.1000 కోట్ల మార్క్ దాటి, బాలీవుడ్‌లో ఆ ఘనత సాధించిన తొలి సినిమాగా రికార్డ్ సృష్టించింది. ప్రస్తుతం దీనికి సీక్వెల్‌గా దురంధర్2 మార్చి 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో స్టార్ హీరో అమిర్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో థియేటర్ల కొరత వల్లే దురంధర్ వసూళ్లు పరిమితమయ్యాయని ఆయన అభిప్రాయపడ్డారు. చైనాలో లభించేంత స్క్రీన్‌లు మనదేశంలో ఉంటే ఈ సినిమా ఇంకా భారీ వసూళ్లు సాధించేదని అన్నారు. ప్రస్తుతం భారత్‌లో సుమారు 9 వేల స్క్రీన్‌లు మాత్రమే ఉండగా, చైనాలో లక్షకు పైగా స్క్రీన్‌లు ఉన్నాయని తెలిపారు. చైనాలో పెద్ద సినిమాలు బిలియన్ డాలర్ల వ్యాపారం చేయడానికి ఇదే ప్రధాన కారణమని అమిర్ ఖాన్ పేర్కొన్నారు. గతేడాది చైనీస్ చిత్రం నె ఝా 2 అక్కడ 2 బిలియన్ డాలర్లు వసూలు చేయగా, భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన దురంధర్ దేశీయంగా సుమారు 115 మిలియన్ డాలర్లకే పరిమితమైందని వివరించారు. భారతదేశంలో స్క్రీన్‌ల సంఖ్య పెంచినప్పుడే సినిమాల వసూళ్లలో నిజమైన మార్పు వస్తుందని, ఇప్పటికీ ఒక్క థియేటర్ కూడా లేని జిల్లాలు చాలానే ఉన్నాయని అమిర్ ఖాన్ సూచించారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com